

వలంటీర్లలా పనిచేయలేం

- పీ-4 కార్యక్రమాల అమలులోనూ అలక్ష్యం
- సూపర్ జీఎస్టీపై ఇంటింటి ప్రచారానికి దూరం
- రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీలోనూ తీవ్ర నిర్లక్ష్యం
- సూపర్ సిక్స్ డిమాండ్లు అమలు చేయాలని డిమాండ్

సచివాలయ కార్యదర్శుల పోరుబాట



నరసరావుపేట మునిసిపాల్టీలోని సచివాలయం

(తెనాలి, ఆంధ్రజ్యోతి)

వలంటీర్లలా ఇంటింటికి వెళ్లం.. వారు నిర్వహించినట్లుగా విధులు నిర్వహించం.. అంటూ సచివాలయాల కార్యదర్శులు పరోక్ష ఉద్యమం చేస్తున్నారు. ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించిన వాట్సాప్ గ్రూపుల నుంచి వారు వైదొలిగారు. సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ పేరిట ప్రభుత్వం పిలుపు ఇచ్చిన ఇంటింటి ప్రచార కార్యక్రమాల్లో కార్యదర్శులు పాల్గొనడంలేదు. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కూడా చేయడంలేదు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న పీ-4 కార్యక్రమాలకు కూడా మున్సిపాల్టీల్లో, పంచాయతీల్లో ఉద్యోగులు దూరంగా ఉంటున్నారు. ప్రభుత్వ ఆదేశాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారన్న ఆరోపణలు ప్రజల నుంచి వస్తున్నాయి. సచివాలయ విధులకు మాత్రమే వారు పరిమితమవుతున్నారు. వలంటీర్లుగా తమను ఇంటింటికి తిప్పడం సరికాదని కార్యదర్శులు పేర్కొంటున్నారు. వలంటీర్లు చేసిన పనులు తమకు అప్పగించడం సరికాదంటున్నారు. ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి దాదాపు 20 సర్వేలు నిర్వహించామని తెలిపారు. తమకు కేటాయించిన విధులు మాత్రమే నిర్వహిస్తామని, సర్వేలు వంటి కార్యక్రమాలకు హాజరు కాలేమని వారు తేల్చిచెబుతున్నారు. మున్సిపాల్టీల్లో జరిగే పలు కార్యక్రమాలకు కూడా వారు గైర్హాజరవుతున్నారు. సూపర్ జీఎస్టీ ప్రచార కార్యక్రమాలకు సచివాలయ కార్యదర్శులు దూరంగా ఉండటంతో మెప్మా సిబ్బందితో అధికారులు నిర్వహిస్తున్నారు.

డిమాండ్ల సాధన కోసం పోరుబాట

సూపర్ సిక్స్ డిమాండ్ల సాధన పేరుతో ఈ నెల 10 నుంచి ఉద్యమంలోకి వెళ్లాలని యూనియన్ నేతలు చర్చలు జరుపుతున్నారు. సూపర్ సిక్స్ డిమాండ్లపై ఇప్పటికే వినతిపత్రం సమర్పించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను తలపించే రీతిలో సచివాలయ ఉద్యోగులు సూపర్ సిక్స్ డిమాండ్లు అమలు చేయాలని కోరుతున్నారు. ఇంటింటి సర్వేల నుంచి విముక్తి కల్పించాలని, నోషనల్ ఇంక్రిమెంట్ మంజూరు చేయాలని, ప్రొబెషనరీ బకాయిలు చెల్లించాలని, ఆరేళ్లు ఒకే పోస్టులో సర్వీసు పూర్తిచేసిన వారికి స్పెషల్ ఇంక్రిమెంట్ మంజూరు చేయాలని, మాతృశాఖల్లో విలీనం చేయాలని, అర్హతకి తగిన ఉద్యోగోన్నతి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఎస్ఎస్ఎంలకు పెంచిన విధంగా కార్యదర్శులందరికీ జీతాలు పెంచాలని డిమాండ్ చేస్తున్నారు.



ప్రభుత్వం చెప్పినట్లుగా గతంలో వలంటీర్లు పని చేసినట్లు మేము పనిచేయలేం.. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ కార్యక్రమాలను అమలు చేయలేం.. అంటూ సచివాలయాల కార్యదర్శులు కార్యాలయాలకే పరిమిత మవుతు న్నారు. కేవలం సామాజిక పింఛన్ల పంపిణీ చేస్తున్నారు. అయితే కొన్ని ప్రాంతాల్లో అది కూడా ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు అందచేయకుండా తమ వద్దకే వారందరినీ పిలిపించుకుని పంపిణీ చేస్తున్నారు. పీ4 కార్యక్రమాల అమల్లో కూడా వారు పాల్గొనడంలేదు. గత నెలలో రేషన్ స్మార్ట్‌కార్డుల పంపిణీ చేపట్టి.. లబ్ధిదారులకు వాటిని ఇళ్ల వద్ద అందజేయాలని సచివాలయ ఉద్యోగులను ప్రభుత్వం ఆదేశించింది. అదేవిధంగా ప్రస్తుతం సూ పర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్‌పై ఇంటింటా ప్రచార బాధ్యతలను కూడా సచివాలయ ఉద్యోగులకు అప్పగించింది. స్మార్ట్ రేషన్ కార్డులను కొన్ని దగ్గర్ల డీలర్లకు అప్పగించగా.. మరికొన్ని ప్రాంతా ల్లో కార్యాలయాలకు వచ్చిన కార్డుదారులకు మాత్రమే అందజేస్తున్నారు. సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ లబ్ధి ప్రజలకు అందా లని.. జీఎస్టీ తగ్గింపు ఫలాలపై మోసపోకుండా ప్రజలను చైతన్య వంతం చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్యక్రమాలను రూపొందించాయి. అయితే ఆయా పనులతో తమకు సంబంధం లేదన్నట్లుగా సచివాలయ ఉద్యోగులు ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘిస్తున్నారు. సూపర్ సిక్స్ డిమాండ్లు అమలు చేయాలంటూ ఇంతకాలం పరోక్ష ఉద్యమం చేస్తున్న సచివాలయ కార్యదర్శులు ప్రత్యక్ష పోరుకు సిద్ధమవుతున్నారు.


సభలో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఇక ఒక్క మరణమూ సంభవించకూడదు..!

- గ్రామంలో ప్రతి 30 గృహాలకు ఓ వలంటీర్
- తురకపాలెం గ్రామసభలో కలెక్టర్ అన్సారియా

గుంటూరు మెడికల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): తురకపాలెంలో ఇకపై ఒక్క మరణం కూడా సంభవించకూడదని కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా ఆకాంక్షించారు. మరణాలకు అడ్డుకట్ట వేసేందుకు గ్రామంలో ప్రతి 30 గృహాలకు ఓ వలంటీర్‌ను నియమిస్తున్నామని చెప్పారు. ఎవరైనా అనారోగ్యం బారిన పడ్డా వెంటనే వారు ఆ సమాచారం ఆరోగ్యశాఖకు తెలియజేస్తారని అన్నారు. ఇందుకు గ్రామస్థులు సహకరించాలని కోరారు. మంగళవారం తురకపాలెంలో కలెక్టర్ పర్యటించి క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించారు. అనంతరం గ్రామస్థులు రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన గ్రామ సభలో మాట్లాడుతూ, తురకపాలెంలో ప్రజల ఆరోగ్య స్థితిగతుల పట్ల ప్రతి రోజూ పర్యవేక్షణ చేస్తున్నామని చెప్పారు. అనారోగ్య పరిస్థితులను విశ్లేషించేందుకు "రాపిడ్ రెస్పాన్స్ టీమ్'లను ఏర్పాటు చేశామన్నారు. అక్టోబరు 2న వైద్య సిబ్బంది కృష్ణవేణి గృహానికి వెళ్లగా అనారోగ్యం ఏమి లేదని ఆమె చెప్పిందని, ఇది సరైన విధానం కాదని స్పష్టం చేశారు. జ్వరాల సర్వే, సీడీ-ఎన్‌సీడీ సర్వే జరుగుతోందని, వైద్య శిబిరాలు నడుస్తున్నాయని కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. గ్రామంలో 102 మందికి బిపి, 69 మందికి మధుమేహం ఉన్నట్లు ఎన్.సి.డి సర్వేలో గుర్తించామని తెలిపారు. ప్రభుత్వ పరంగా అన్ని సౌకర్యాలు అందేటట్లు చర్యలు తీసుకుంటామని చెప్పారు. అన్ని మందులు అందుబాటులో ఉంచామన్నారు. కార్యకర్తలుగా సేవలందించేందుకు గ్రామస్థులు ముందుకు రావడాన్ని కలెక్టర్ అన్సారియా అభినందించారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి: గ్రామస్థులు

గ్రామంలో చనిపోయిన వారి కుటుంబాలతో పాటు వైద్యం చేయించుకుని ఆర్థికంగా చితికిపోయిన వారికి నష్టపరిహారం అందించాలని గ్రామస్థులు డి. సూర్యప్రకాశరావు, దాసు, కుమ్మరయ్య, షేక్ వలి, నాగు, ఎం. నాగేశ్వర రావు, కోటేశ్వర రావు, భీమ్‌రావు కలెక్టర్‌ను కోరారు. గ్రామంలో మహిళలకు కాళ్ల మీద చీము గడ్డలు ఎక్కువగా వస్తున్నాయని, చనిపోయిన వారిలో ఇదే పరిస్థితి ఉందన్నారు. క్షేత్ర స్థాయి వైద్య సిబ్బందిని పెంచడంతో పాటు అన్ని మందులు అందుబాటులో ఉంచాలని విన్నవించారు. గతంలో ఉపయోగించిన బోరుకు మరమ్మతులు చేయించి, నీటి పథకాన్ని జెండా చెట్టు దగ్గర ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కలెక్టర్‌ను కోరారు. గ్రామ సభలో రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాసరావు, జిల్లా వైద్యారోగ్య అధికారి కె.విజయలక్ష్మి, గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కె.కల్యాణ చక్రవర్తి, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగసాయికుమార్ పాల్గొన్నారు.

రెండో రోజూ అమరావతిలో ఏడీబీ బృందం

తుళ్లూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆసియా అభివృద్ధి బ్యాంకు(ఏడీబీ) బృందం రాజధాని అమరావతి పర్యటన వరుసగా రెండో రోజు కొనసాగింది. అమరావతి పనుల్లో పురోగతి, ఏడీబీ ఆర్థిక సహకారం తదితర అంశాలను బృందంలోని సభ్యులు రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో చర్చించారు. ఏడీబీ - వాటర్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ సెక్టార్ బృందంలోని సభ్యులైన నోరియా సైటో, మనోజ్ శర్మ, సంజయ్ జోషి, అశ్విన్ హోసూర్ విశ్వనాథ్ తొలుత విజయవాడలోని సీఆర్‌డీఏ కార్యాలయంలో కమిషనర్ కే కన్నబాబు, అదనపు కమిషనర్లు జీ సూర్య సాయి ప్రవీణ్‌చంద్, అమిలినేని భార్గవతేజ్‌తో సమావేశమయ్యారు. అనంతరం బ్యాంకు బృందం సచివాలయంలో పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి ఎస్ సురేష్‌కుమార్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్‌కుమార్, పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యదర్శి ఎన్ యువరాజ్, ఆర్థిక శాఖ కార్యదర్శి రొనాల్డ్‌రాస్‌ను కలిశారు. రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే విజయానంద్‌ను ఆయన చాంబర్‌లో ఏడీబీ బృందం కలిసింది.


సీఆర్‌డీఏ అధికారులతో సమావేశమైన ఆసియా అభివృద్ధి బ్యాంకు బృందం సభ్యులు

రాజధాని భద్రతపై ప్రత్యేక దృష్టి

నార్త్, సౌత్ సబ్ డివిజన్ల సమీక్షలో ఎస్పీ

గుంటూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి ప్రాంతంలో భద్రతా ప్రమాణాలను మెరుగు పరచడానికి ప్రత్యేకంగా దృష్టి సారించాలని పోలీసు అధికారులను ఎస్పీ వకుల్‌జిందాల్ ఆదేశించారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో తుళ్లూరు, నార్త్ పోలీస్ సబ్ డివిజన్ల అధికారులతో ఎస్పీ సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వీవీఐపీ, వీఐపీలు ఎక్కువగా రాకపోకలు సాగించే, నివసించే ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల కార్యకలాపాలను నిరోధించే విధంగా నిఘా వ్యవస్థ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పాత నేరస్తుల కదలికలపై దృష్టి సారించాలన్నారు. ప్రఖ్యాత విద్యాసంస్థల ప్రాంతాల్లో గస్తీని పటిష్ఠ పరిచి విద్యార్థులకు తగిన భద్రత కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సచివాలయం, హైకోర్టు మార్గాల్లో ట్రాఫిక్ అంతరాయం కలగకుండా అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలన్నారు.


తుళ్ళూరు, నార్త్ సబ్ డివిజన్ల సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ వకుల్‌జిందాల్

కొనుగోళ్లపై కినుక

ముగింపు దశకొచ్చిన బర్లీ సేకరణ

- ప్రక్రియపై రైతుల మిశ్రమ స్పందన
- రైతుల వద్ద ఇంకా పెద్దఎత్తున పొగాకు నిల్వలు
- రూ.273 కోట్లకు రూ.143 కోట్ల మేర కొనుగోలు చేసిన మార్క్‌ఫెడ్


బాపట్లలోని వేర్‌హౌసింగ్ గోడౌన్ వద్ద పొగాకు బేళ్లతో నిలిచి ఉన్న ట్రాక్టర్లు (ఫైల్ ఫొటో)

(గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి)

చివరి ఆకు వరకు కొనుగోలు చేస్తాం.. ఎవరూ నిరుత్సాహ పడాల్సిన అవసరం లేదు.. అని నైరాశ్యంలో మునిగిపోయిన బర్లీ పొగాకు రైతులకు గతంలో ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఆ ప్రకారమే గతంలో ఎన్నడూ లేనట్లుగా మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోళ్లు చేపట్టింది. ప్రత్యేకంగా నిధులను కూడా కేటాయించింది. ప్రభుత్వం పొగాకు కొనుగోళ్లపై తీసుకున్న నిర్ణయాలపై బాపట్ల జిల్లాతో పాటు పల్నాడు, గుంటూరు, ప్రకాశం జిల్లాల బర్లీ పొగాకు రైతులు అప్పట్లో ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. మూడు నెలలు కొనుగోళ్ల ప్రక్రియ సాగినా.. విడతల వారీగా రైతుల ఖాతాలకు నిధులు జమ అవుతున్నా.. సాగుదారులు పలువురు ఇంకా అసంతృప్తిగా ఉన్నట్లు సమాచారం. అధికారుల ప్రణాళిక లేమి వల్లనో లేక ముందస్తు అంచనాలు లేకపోవడం వల్లనో కానీ కొనుగోళ్ల ఘట్టం అనేక ఇబ్బందులకు దారి తీయడమే రైతుల్లో అసంతృప్తికి కారణమని తెలిసింది. సెప్టెంబరు చివరికే కొనుగోళ్లు నిలిపేస్తామని తొలుత మార్క్‌ఫెడ్ ప్రకటించింది. కానీ మరో రెండు వారాలు పొడిగిస్తున్నట్లు అధికారులు నామమాత్రపు ప్రకటన చేశారు తప్పితే ఎక్కడా బర్లీ సేకరిస్తున్న దాఖలాలు లేవు. అయితే ఇప్పటికీ రైతుల వద్ద ఇంకా కనీసంగా 80 వేల క్వింటాళ్ల పొగాకు నిల్వలు ఉన్నాయని క్షేత్రస్థాయి పరిస్థితులు ధ్రువీకరిస్తున్నాయి. మొత్తం రిజిష్టర్ చేసుకున్న రైతుల సంఖ్య 16,734గా ఉండగా అంతిమంగా మార్క్‌ఫెడ్ గణాంకాల ప్రకారం 12,250 మంది (మిగతా 6లో)

బర్లీ పొగాకు కొనుగోళ్లకు సంబంధించి గతంలో ప్రభుత్వం రూ.273 కోట్లు కేటాయించింది. అయితే ఇప్పటి వరకు రూ.143 కోట్ల మేర మాత్రమే కొనుగోలు చేసినట్లు మార్క్‌ఫెడ్ గణాంకాలు ధ్రువీకరిస్తున్నాయి. మూడు నెలల్లో 2,12,949 క్వింటాళ్లను మార్క్‌ఫెడ్ సేకరించింది. ఇందులో అత్యధికంగా బాపట్ల జిల్లా నుంచి 1,43,356 క్వింటాళ్లను కొనుగోలు చేసింది. గుంటూరు జిల్లాలో 32,729, పల్నాడులో 24,409 క్వింటాళ్లను కొనుగోలు చేసింది. ఇప్పటి వరకు రైతుల ఖాతాల్లో రూ.98 కోట్లు జమ చేసినట్లు మార్క్‌ఫెడ్ అధికారులు చెబుతున్నారు. ఇంకా రూ.45 కోట్లు చెల్లించాల్సి ఉంది.

2,12,949 క్వింటాళ్ల సేకరణ..

జేడీతో మిర్చి ఎగుమతిదారుల భేటీ

ఎత్తిపోతలకు జలకళ

అల్లు రామలింగయ్య కాంస్య విగ్రహం ఆవిష్కరణ

జూనియర్ ఎన్‌టీఆర్ ప్లెక్సీ రగడ

- యనమదలలో సోమవారం అర్ధరాత్రి కొట్టుకున్న ఇరు వర్గాలు
- ప్లెక్సీని మార్ఫింగ్ చేయడమే వివాదానికి కారణం

6

వీడని వరద.. వెతలు

- ముంపుతో నగరవాసులు ఇక్కట్లు
- ఓ మోస్తరు వర్షాలకే తటాకాల్లా రోడ్లు



వరద నీటిలో చుట్టుగుంట రైతు బజారు

గుంటూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): రాజధాని జిల్లా కేంద్రమైన గుంటూరు నగరానికి వరద నీటి ముంపు పీడ విరగడం కావడం లేదు. ఓ మోస్తరు వర్షానికే ఎక్కడికక్కడ రోడ్లపై నీరు నిలిచి తటాకాలను తలపిస్తోంది. కొన్ని ప్రాంతాల్లో వర్షం వెలిసిన రెండు, మూడు గంటల్లో వరదనీరు తగ్గిపోతుండగా మరికొన్ని ప్రాంతాల్లో 24 గంటల తర్వాత కూడా నీరు నిలిచి ఉంటోంది. దీంతో చినుకులు పడుతున్నాయంటే నగరవాసులు భయాందోళనలు చెందుతున్నారు. నల్లపాడు రోడ్డులోని చుట్టుగుంట సెంటర్ వద్ద 24 గంటలైనా వరద తగ్గుముఖం పట్టడం లేదు. ఈ కారణంగా ఉద్యోగులు వ్యవసాయ, మార్కెటింగ్ కమిషనరేట్లలో విధులకు హాజరు కాలేకపోతున్నారు. చుట్టుగుంట రైతుబజారు, పక్కనే ఉన్న అన్న క్యాంటీన్‌లోకి మోకాలి లోతు డ్రెయినేజీ నీటిలో వెళ్లాల్సి వస్తోంది. ఆ సమీపంలోని మురికిపేటలో అయితే రోజుల తరబడి వర్షం నీరు నిలిచిఉంటోంది. నగరం నడిబొడ్డున నగర పాలకసంస్థ కార్యాలయం ఆనుకునే ఉన్న వెన్‌లాక్ మార్కెట్ సెల్లార్‌లోకి నాలుగైదు అడుగుల ఎత్తులోకి వరదనీరు చేరుతోంది. ఈ నీటిలో చేపలు, మాంసం, చికెన్ వ్యర్థాలు పడేస్తుండటంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి.


వెన్ లాక్ మార్కెట్ సెల్లార్లో నిలిచిపోయిన వర్షపు నీరు


చిలకలూరిపేట రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

డ్రెయిన్ వెడల్పు కుదింపుతోనే సమస్య..

గతంలో మిర్చియార్డు వద్ద ఉన్న శ్మశాన వాటిక నుంచి డ్రెయిన్ చాలా వెడల్పుగా ఉండేది. దాంతో ముంపు సమస్య ఉండేది కాదు. డ్రెయిన్ వెడల్పు ని కుదించి లోతు పెంచి నిర్మించారు. దీంతో వర్షం పడినప్పుడల్లా ముంపు సమస్యలు నెలకొంటు న్నాయి. తరచూ వరదనీరు చుట్టుగుంట రైతుబజార్, అన్న క్యాంటీన్, వ్యవసాయ, మార్కెటింగ్ కమిషనరేట్లు, మార్కెటింగ్ డీడీ, ఏడీ కార్యాలయాలను ముంచెత్తుతున్నది. మురికిపేటలో ప్రమాదకరంగా ఇళ్ల మధ్య నుంచి ప్రవహిస్తున్నది. ఇటీవల నూతనంగా నిర్మించిన డ్రెయిన్ కూడా ఈ ప్రవాహాన్ని తట్టుకోలేకపోతున్నది. చిలకలూరిపేట రోడ్డులోనూ స్పైసెస్‌బోర్డు కార్యాలయం వద్ద వరదనీరు నిలిచిపోతున్నది.

చినకరకట్ట రోడ్డుకు కోత

- రేపల్లె కాల్వకు నీటి విడుదలే కారణం
- అధికారుల అవగాహనా లోపంపై రైతుల ఆగ్రహం

కొల్లిపర, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): అవగాహనా లోపంతో.. ముందస్తు ప్రణాళిక లేకుండా.. రేపల్లె కాల్వకు నీటిని విడుదల చేయడంతో చినకరకట్ట రోడ్డు కోతకు గురవుతోంది. రేపల్లె కాల్వకు 2 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు ఇరిగేషన్ అధికారులు విడుదల చేశారు. దీంతో ఆ నీటి ఉధృతికి పలు చోట్ల రోడ్డు కోతకు గురవుతుంది. దీంతో రోడ్డు ఎక్కడ దెబ్బతింటుందోనని రైతులు, ఆందోళన చెందుతున్నారు. కోతకు గురైన రోడ్డుకు కొల్లిపర బూత్‌మిల్లి కాల్వ వద్ద రంధ్రంపడటంతో ఆ ప్రాంతంలో రాకపోకలను నిలిపివేశారు. చినకరకట్ట రోడ్డుకు ఒక పక్క రేపల్లె కాల్వ మరోపక్క పంట కాల్వలో నీరు ప్రవహిస్తుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందేమోనని రైతులు అందోళన చెందుతున్నారు. ఈ పరిస్థితుల్లో రేపల్లె కాల్వకు నీటిని తక్కువగా విడుదల చేయాలని పెదపర్తిపాలెం, మున్నంగి, కొల్లిపర ప్రజలు అధికారులను కోరుతున్నారు.


కొల్లిపర బూత్‌మిల్లి కాల్వ వద్ద చినకరకట్ట నుంచి ప్రవహిస్తున్న నీరు


కొల్లిపర వంతెన సమీపంలో కోతకు గురవుతున్న రోడ్డు

ఎత్తిపోతలకు జలకళ



మాచర్ల మండలంలోని పర్యాటక కేంద్రమైన ఎత్తిపోతల జలకళతో పర్యాటకులను ఆకర్షిస్తోంది. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో వాగులు, అటవీ మార్గాల ద్వారా వరద నీరు ఎత్తిపోతలకు వచ్చి చేరుతోంది. 70 అడుగుల ఎత్తు నుంచి కిందకు దూకుతున్న ఎత్తిపోతల జలపాతం అందాలు పర్యాటకులను మంత్ర ముగ్ధులను చేస్తున్నాయి. జలపాతం అందాలను చూసేందుకు పర్యాటకులు పెద్ద సంఖ్యలో ఎత్తిపోతలకు చేరుకుంటున్నారు.

-(విజయపురిసౌత్, ఆంధ్రజ్యోతి)

41,648 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 43,284 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 41,648 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 7,909 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9800	12000
334	10500	14400	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	14300	334	10500	14500
273	---	---	నెంబరు. 5	10000	14000
341	10000	14800	273	----	----
4884	---	----	341	10000	15000
సూపర్ 10	---	----	4884	10000	13600
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	15000	తేజ	10000	14800
షార్క్-1	-----	---	బ్యాడిగి	10000	15500
బ్యాడిగి	10000	15400	దేవనూరు డీలక్స్	10500	14200
దేవనూరు డీలక్స్	10000	14000	తాలుకాయలు	5000	7200

టెయిల్ పాండ్ ప్రాజెక్టుకు భారీగా వరద నీరు

12 గేట్లు ఎత్తి పులిచింతలకు నీటి విడుదల

రెంటచింతల, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టు భారీగా వరద నీరు వచ్చి చేరుతుండడతో 12 గేట్లను ఎత్తి పులిచింతలకు 1,99,702 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టుకు ఎగువన ఉన్న సాగర్ నుంచి 1,61,381 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లోగా వస్తోంది. సోమవారం అర్ధరాత్రి 12 గంటల వరకు 1.0224 ఎంయూల విద్యుత్ తయారవ్వగా మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి విద్యుదుత్పత్తిని నిలిపి వేసినట్లు ప్రజెక్టు ఎస్ఈ కె.వెంకటరమణ, ఈఈలు సుబ్రహ్మణ్యం, నాగరాజు తెలిపారు. రిజర్వాయర్‌లో 75.50 మీటర్ల మేర నీరుండగా ఇది 7.080 టీఎంసీలకు సమానమని వారు చెప్పారు.

కొల్లిపరకు బ్రెజిల్ బృందం



ప్రకృతి వ్యవసాయ పంటలను పరిశీలిస్తున్న బ్రెజిల్ ప్రతినిధుల బృందం

కొల్లిపర, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ అమలు విధానాలపై అవగాహన పొందటానికి రాష్ట్రంలో పర్యటిస్తున్న బ్రెజిల్ ప్రతినిధుల బృం ద సభ్యులు మం గళవారం కొల్లిపర మండలంలోని అత్తోట, దావులూ రి పాలెం గ్రామాలను సం దర్శించారు. ప్రకృ తి వ్యవ సాయ ఏడీఏ రాజకుమారి బ్రెజిల్ ప్రతి నిధుల బృందానికి స్వాగతం పలికి జిల్లాలో రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ప్రకృతి వ్యవసాయ అమలు తీరు, పురోగతి గురించి క్లుప్తంగా వివరించారు.

బయో ఇన్‌పుట్‌ల తయారీ, ఘన జీవామృతం, బీజామృతం, ద్రవ జీవామృతం తయారీపై రైతు సాధికార సంస్థ చీఫ్ టెక్నాలజి ఆఫీసర్ లక్ష్మనాయక్ వారికి అవగాహన కలిగించారు. దేశీ ఆవు ప్రకృతి వ్యవసాయంలో కీలక పాత్ర పోషిస్తున్నదని, ఆవుపేడ, మూత్రంలో అధికంగా లభించే సూక్ష్మజీవులు భూమి సారాన్ని పెంచి పంటల ఆరోగ్యాన్ని కాపాడతాయని బ్రెజిల్ బృందానికి తెలియజేశారు. అనంతరం బ్రెజిల్ ప్రతినిధుల బృందం రైతులు ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో బ్రెజిల్ బృందం ప్రతినిధులతో పాటు ప్రకృతి వ్యవసాయాధికారులు జాకీర్ హుస్సేన్, కృష్ణారావు, వాణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

జేడీతో మిర్చి ఎగుమతిదారుల భేటీ



మిర్చియార్డులో ఎక్స్‌పోర్టర్లతో సమావేశమైన మార్కెటింగ్ జేడీ శ్రీనివాసరావు

గుంటూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఈశాన్య రాష్ట్రాలకు మిర్చి ఎగుమతుల రవాణా విషయంలో లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రమేయాన్ని అరికట్టాలని మిర్చి ఎగుమతిదారులు మార్కెటింగ్ ప్రాంతీయ జాయింట్ డైరెక్టర్ (జేడీ) కాకుమాను శ్రీనివాసరావును కోరారు. మంగళవారం గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిపాలన భవనంలో జేడీ శ్రీనివాసరావుతో ట్రేడర్లు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మార్కెటింగ్ డీడీ దివాకర్, గుంటూరు ఏడీ సత్యన్నారాయణ చౌదరి, ఉన్నతశ్రేణి కార్యదర్శి చంద్రిక హాజరయ్యారు. సమావేశంలో తొలుత వ్యాపారస్థుల సమస్యలను జేడీ శ్రీనివాసరావు అడిగి తెలుసుకొన్నారు. మిర్చి ట్రేడర్ల తరుపున తోట రామకృష్ణ, కొత్తూరి సుధాకర్, జుగిరాజ్ భండారి, నరేంద్ర తదితరులు మాట్లాడారు. కొన్ని నెలలుగా లారీ అసోసియేషన్ ప్రమేయం లేకపోవడం వల్ల మిర్చి ఎగుమతులు భారీగా జరిగాయని, ఇతర మార్కెట్ కమిటీలకు వెళ్లిపోయిన వ్యాపారస్థులు కూడా వెనక్కు వచ్చేశారని తెలిపారు. మళ్లీ నాలుగైదు రోజుల నుంచి లారీ యజమానులపై యూనియన్ నేతలు ఒత్తిడి తెచ్చి లోడింగ్‌లు పెట్టకుండా అడ్డుకొంటున్నారని ఆరోపించారు. దీని వల్ల తమ వద్ద రూ. కోట్లాది విలువ చేసే స్టాకు ఉండిపోయిందని అన్నారు. దీనిపై తగిన చర్యలు చేపట్టకపోతే తాము ట్రేడ్ బంద్‌కు వెళ్లడం మినహా మరో ప్రత్యామ్నాయం లేదని తేల్చి చెప్పారు. దీనిపై జేడీ శ్రీనివాసరావు స్పందించి, తాను లారీ అసోసియేషన్ ప్రమేయం గురించి మార్కెటింగ్ డైరెక్టర్ విజయ సునీతకు నివేదించి ఆమె ద్వారా రవాణాశాఖ కమిషనర్, రాష్ట్ర డీజీపీకి లేఖలు రాయిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో యార్డు ఇన్‌చార్జీ సుబ్రహ్మణ్యం, గ్రేడ్-3 సెక్రెటరీ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పీ-4 అమలుపై రాజస్థాన్ అధికారుల ఆరా



పీ-4 అమలుపై వివరాలను తెలుసుకుంటున్న రాజస్థాన్ ప్రతినిధులు

మంగళగిరి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలన కోసం ఏపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పీ-4 పథకంపై రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన ప్రణాళికా విభాగం ఉన్నతాధికారులు వివరాలను సేకరించారు. మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్వర్ణాంధ్ర విజన్-2024 యూనిట్ కార్యాలయాన్ని మంగళవారం రాజస్థాన్ అధికారుల బృందం సందర్శించింది. పీ-4 పథకానికి సంబంధించిన సమగ్ర సమాచారం, అమలు తీరు, నియోజకవర్గ, జిల్లా విజన్ యాక్షన్ ప్లాన్ తదితర విషయాలను స్థానిక అధికారులు వారికి వివరించారు. 2047 నాటికి నిర్దేశించుకున్న లక్ష్యాన్ని నెరవేర్చే నిమిత్తం రూపొందించిన కీ పెర్ఫామెన్స్ ఇండికేటర్స్‌ను గురించి అడిగి తెలుసుకున్నారు. స్వర్ణాంధ్ర సాధన కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసు కుంటున్న చర్య లు గొప్పగా ఉన్నాయని రాజస్థాన్ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చేతన్ ప్రకాశ్ మండవల్, నిర్మల్ సేఠీ, వినేష్ సంఘ్వీ, డైరెక్టరేట్ ఆఫ్ ఎకనమిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ ఉపగణాంకాధికారి సౌలు రాజు, సహాయ గణాంకాధికారి దానబోయిన బాల నాగేశ్వర రావు పాల్గొన్నారు.

అల్లు రామలింగయ్య కాంస్య విగ్రహం ఆవిష్కరణ



అల్లు రామలింగయ్య కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న అల్లు అరవింద్, కొల్లి బాబి, నసీర్ అహ్మద్, కోవెలమూడి రవీంద్ర తదితరులు

గుంటూరు(తూర్పు), అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ నిర్మాత, గీతా ఆర్ట్స్ అధినేత అల్లు అరవింద్ మంగళవారం గుంటూరు నాజ్ సెంటర్ కూడలిలోని ఐల్యాండ్ సెంటర్‌లో అల్లురామలింగయ్య నాటక కళా పరిషత్ అండ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అల్లు రామలింగయ్య కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అల్లు అరవింద్ మాట్లాడుతూ, ఎంత ఉన్నా ఒదిగి ఉండాలని తన తండ్రి తనకు నేర్పారని చెప్పారు. హోమియో వైద్యునిగా, స్వాతంత్ర్య సమరయోధునిగా ఎనలేని సేవలందించడంతోపాటు, వెయ్యికిపైగా సినిమాల్లో అల్లు రామలింగయ్య నటించి ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసిన అటువంటి మహనీయుని విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. అమరావతిలో సినిమా ఇండస్ట్రీ అభివృద్ధి చెందేలా కూటమి ప్రభుత్వంతో త్వరలో చర్చిస్తామని చెప్పారు. దర్శకుడు కొల్లి బాబీ మాట్లాడుతూ, గుంటూరు నాజ్ థియేటర్‌లో ఇంద్ర సినిమా టికెట్ల కోసం లాఠీ దెబ్బలు తిన్న సంగతిని గుర్తుచేసుకున్నారు. అనంతరం విగ్రహ శిల్పి అక్కల శ్రీరామ్‌ను అరవింద్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సినీ నిర్మాత బన్నీ వాసు, ఐడిసీ ఛైర్మన్ డేగల ప్రభాకర్, మేయర్ కోవెలమూడి రవీంద్ర, ఎమ్మెల్యే నసీర్ అహమద్, బీజేపీ నాయకుడు డాక్టర్ శకక్కాయల ఉమాశంకర్, పరిషత్ సభ్యులు పెండెం శివప్రసాద్, రేజేటి రామకృష్ణ, లాల్‌వజీర్, డేగల వెంకటేశ్వరరావు, రాఘవయ్య పాల్గొన్నారు.

జూనియర్ ఎన్టీఆర్ ఫ్లెక్సీ రగడ

● యనమదలలో సోమవారం అర్ధరాత్రి కొట్టుకున్న ఇరు వర్గాలు

● ఫ్లెక్సీని మార్ఫింగ్ చేయడమే వివాదానికి కారణం



వివాదానికి దారి తీసిన మార్ఫింగ్ చేసిన జూనియర్ ఎన్టీఆర్ ఫ్లెక్సీ

ప్రత్తిపాడు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): జూనియర్ ఎన్టీఆర్ ఫ్లెక్సీ రగడ సృష్టించింది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా వున్నాయి. గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం యనమదల గ్రామంలో ఏర్పాటు చేసిన జూనియర్ ఎన్టీఆర్ ఫ్లెక్సీని ఏఐలో మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పెట్టడం గొడవకు దారి తీసింది. యనమదలలో జూనియర్ ఎన్టీఆర్ ఫ్లెక్సీని అభిమానులు ఏర్పాటు చేశారు. అయితే దీనిని కొందరు ఆకతాయిలు సేమ్ అదే ఫ్లెక్సీని జూనియర్ ఎన్టీఆర్‌కు వెంట్రుకలు లేనట్టు (బోడి గుండు) చూపిస్తూ క్రియేట్ చేసి సోషల్ మీడియాలో అసభ్యకర పదజాలతో పోస్టింగ్‌లు పెట్టారు. దీంతో గ్రామంలోని ఎన్టీఆర్ అభిమానులు ఆగ్రహించారు. ఈ క్రమంలో గ్రామంలో సోమవారం రాత్రి గొడవ జరిగి కొట్లాటకు దారి తీసింది. ఇరు వర్గాలకు చెందిన వారు కొట్టుకోవడంతో గ్రామంలో అర్ధరాత్రి ఒక్కసారిగా అలజడి ప్రారంభమైంది. దీంతో ఈ పంచాయతీ మంగళవారం ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్‌కు చేరింది.

కొనుగోళ్లపై కినుక

(5వ పేజీ తరువాయి)

రైతుల నుంచే కొనుగోళు చేశారు. అంటే ఇంకా 4484 మంది రైతుల నుంచి పొగాకు కొనుగోలు చేయాల్సి ఉంది. వీరు కాకుండా అవగాహన లేక మరెందరో రిజిష్టర్ చేసుకోలేదని సమాచారం. వీరందరి వద్ద పెద్దఎత్తున నిల్వలు ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో వీరందరిలోనూ అయోమయం నెలకొంది. మరో వైపు కేబినెట్ ఆమోదం తెలిపిన నిధులు కేటాయింపులో రూ.130 కోట్లు మిగులు ఉన్నట్లు కనబడుతుండడంతో కొనుగోళ్ల కొనసాగించడంపై ఉన్న అభ్యంతరం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు.

బర్లీ పొగాకు కొనుగోళ్ల ప్రారంభమైన దగ్గర నుంచి కూడా వాటిని నిల్వ ఉంచడానికి గోడౌన్ల లభ్యత అధికా రులకు సవాల్‌గా మారిం ది. వీటి విషయం లో ముందస్తు సన్నద్ధత లేకపోవడం కూడా రైత ులను తీవ్ర ఇబ్బం దులకు గురి చేసిం ది. పర్చూరు నియోజకవర్గ పరిధిలోని రైతులకు గుం టూరు, ప్రకాశం జిల్లాల్లోని గోడౌన్లకు తీసుకువెళ్లే విధం గా షెడ్యూలింగ్ ఇవ్వడం, రవాణా ఖర్చులపై స్పష్టత ఇవ్వకపోవడాన్ని రైతులు తప్పుబట్టారు. ఇవన్నీ ఒక ఎత్తయితే 20 క్వింటాళ్ల పరిమితి అని ప్రభుత్వం ప్రకటించాక రైతుల సెల్ ఫోన్లకు పొంతనలేని మెసేజ్‌లు రావడం, వారు తీసుకొచ్చిన పొగాకు బేళ్లను తిరిగి తీసుకువెళ్లడం లాం టివన్నీ కూడా అధికారుల వైఫల్యానికి సాక్ష్యంగా నిలిచాయి. మార్కెటింగ్, వేర్‌హౌసింగ్, ఎఫ్‌సీఐ గోదాములు మొత్తం 56 చోట్ల పొగాకును నిల్వ ఉంచారు. పొగాకు నాణ్యత విషయంలో మార్క్‌ఫెడ్ నియమించుకున్న బయ్యర్లకు జీతాలు చెల్లించే విషయంలో కూడా ఎడతెగని జాప్యం కారణంగా ఇటీవల వారు విధులు కూడా బహిష్కరించారు. కొనుగోళ్ల వాస్తవికతతో పాటు, నిధుల లభ్యత, గోడౌన్ల సాధ్యాసాధ్యాలను ప్రభుత్వానికి వివరించడంలో అధికారుల తప్పిదాల వల్ల రైతుల ఆశలను మార్క్‌ఫెడ్ చేరుకోలేకపోయింది.

9న పీజీ సెట్ దివ్యాంగ అభ్యర్థుల ధ్రువ పత్రాల పరిశీలన

ఏఎన్‌యూ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఏపీ పీజీ సెట్-2025 ఉత్తీర్ణులైన ప్రత్యేక క్యాటగిరీకి చెందిన డిజేబుల్ అభ్యర్థులకు ఈ నెల 9న ధ్రువపత్రాల పరిశీలన జరుగుతుందని పీజీసెట్ కన్వీనర్ ఆచార్య రవికుమార్ మంగళవారం తెలిపారు. అభ్యర్థులు ఆ రోజు ఏఎన్‌యూ హెల్ప్‌లైన్ కేంద్రంలో ఉదయం 10 గంటలకు హాజరు కావాలని సూచించారు. అభ్యర్థులు తమ వెంట ఒరిజినల్ పీడబ్ల్యూడీ, విద్యార్హతల సర్టిఫికెట్లతో పాటు జిరాక్స్ కాపీలను తీసుకురావాలని కన్వీనర్ రవికుమార్ పేర్కొన్నారు.

కల్తీ మద్యంపై జగన్‌ది విష ప్రచారం

నరసరావుపేట టౌన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): కల్తీ మద్యంపై మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విషప్రచారం చేస్తున్నారని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ విమర్శించారు. స్వప్రయోజనాల కోసమే ఆయన ప్రతి అంశాన్ని రాజకీయం చేసి లబ్ది పొందాలని చూస్తున్నారని మండిపడ్డారు.

కల్తీ మద్యానికి మూలవిరాట్ జగనే

● ఏపీటీఎస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ



మన్నవ మోహనకృష్ణ

గుంటూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): కల్తీ మద్యానికి మూల విరాట్ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డేనని ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ ఆరోపించారు. గుంటూరులోని తన కార్యాల యంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో కల్తీ మద్యం తాగి వేలాది మంది ప్రాణాలు కోల్పోయారని, లక్షలాది మంది ఆరోగ్యం దెబ్బతిందని విమర్శించారు. తన స్వప్రయోజనాల కోసం జగన్ ప్రతి అంశాన్ని రాజకీయం చేసి లబ్ధి పొందాలని చూస్తున్నాడన్నారు. అన్నమయ్య జిల్లా ములకలచెరువు కల్తీమద్యం ఘటనపై ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టిందని, కల్తీ మద్యం తయారీ కేసులో 14 మంది పాత్ర, ప్రమేయాన్ని గుర్తించిన పోలీస్ శాఖ, 10మందిని అరెస్టు చేసిందని ఆయన వివరించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న జయచంద్ర రెడ్డి, కట్టా సురేంద్రను పార్టీ నుంచి సస్పెండ్ చేశారని ఆయన తెలియజేశారు. తప్పు చేస్తే ఎంతటి వారినైనా వదిలే ప్రసక్తే లేదు అనే విధంగా సీఎం చంద్రబాబు చర్యలు తీసుకోవడం మంచి పరిణామమని, మన్నవ మోహనకృష్ణ చెప్పారు.

నగరాభివృద్ధిలో ఆస్తి పన్ను వసూళ్లు కీలకం

● నూరు శాతం వసూళ్లకు అధికారులు కృషి చేయాలి

● నగర మేయర్ రవీంద్ర



మాట్లాడుతున్న మేయర్ రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): నగరాభివృద్ధిలో ఆస్తి పన్ను వసూళ్లు కీలకమని, ప్రతి వార్డు సచివాలయం పరిధిలో బకాయిలు, ప్రస్తుత పన్ను నూరు శాతం వసూళ్లు చేసేలా అడ్మిన్ కార్యదర్శులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, అధికారులు కృషి చేయాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలిపారు. నగర కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి కౌన్సిల్ సమావేశ మందిరంలో రెవెన్యూ అధికారులు, ఇన్‌స్పెక్టర్లు, అడ్మిన్ కార్యదర్శులతో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

మేయర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో నగరంలో విస్తృతంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, రానున్న కాలంలో నగర సమగ్రాభివృద్ధి లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపట్టనున్నామన్నారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండవ అర్థ సంవత్సరం వచ్చినప్పటికీ పన్ను వసూళ్ళలో పురోగతి లేదని అసహనం వ్యక్తం చేశారు. శనివారం నాటికి పురోగతి లేకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సీహెచ్ శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, రెవెన్యూ అధికారులు రవికిరణ్‌రెడ్డి, మదన్ గోపాల్, సాదిక్ బాషా, రెహ్మాన్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, అడ్మిన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

తాగునీటి పైప్‌లైన్లను యుద్ధ ప్రాతిపాదికన మార్చాలి

● కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఏళ్ల వారీగా డ్రెయిన్లకు సమాంతరంగా ఉన్న తాగునీటి పైప్ లైన్లను యుద్ధప్రాతిపదికన మార్చాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులకు స్పష్టం చేశారు. కమిషనర్ మంగళవారం ఆనంద పేట, జేకేసీ కాలేజి రోడ్డు, ఇన్నర్ రింగ్ రోడ్డు, టెలికాం నగర్, బాలాజీ నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి, అభివృద్ధి, పారిశుధ్య పనులను పరిశీలించి సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ వర్షాలకు గోతులు పడిన రోడ్లకు పాట్ హోల్స్ మెషిన్ ద్వారా మరమ్మతులు చేపట్టాలన్నారు. పర్యటనలో కార్పొరేటర్ అబీద్ బాషా, డీఈఈ శ్రీనివాస్, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

డ్రెయిన్స్, ర్యాంపులపై ఆక్రమణ తొలగించాలి

నగర పరిధిలోని హనుమయ్య విగ్రహం నుంచి బృందావన్ గార్డెన్స్ లక్ష్మీపురం మదర్ థెరిస్సా విగ్రహం వరకు ఇరువైపులా డ్రెయిన్లపై ర్యాంప్‌లు, ఆక్రమణలను తొలగించి, పూడికతీత పనులు చేపట్టాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో మంగళవారం ఇంజనీరింగ్, పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్య అధికారులతో సంయుక్త సమావేశం నిర్వహించారు. కమిషనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ జిన్నాటవర్ నుంచి చేపట్టిన డ్రెయిన్లపై స్లాబ్లు, ఆక్రమణల తొలగింపు, పూడికతీత పనులను మరోవైపు కూడా వేగంగా చేస్తూ వై జంక్షన్ వరకు చేపట్టాలని డీసీపీని ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ టి.వెంకట కృష్ణయ్య, సిటి ప్లానర్ రాంబాబు, ఎస్ఈ (ఇన్‌చార్జి) సుందర్రామిరెడ్డి, ఎంహెచ్‌ఓ డాక్టర్ లక్ష్మీనారాయణ, ఇంజనీరింగ్, పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్య అధికారులు పాల్గొన్నారు.



కృష్ణవేణికి సర్వేపల్లి రాధాకృష్ణ ప్రతిభా పురస్కారాన్ని అందజేస్తున్న పాఠశాల సెక్రటరీ పాటిబండ్ల విష్ణువర్ధన్ తదితరులు

కృష్ణవేణికి సర్వేపల్లి రాధాకృష్ణ ప్రతిభ పురస్కారం

● పాఠశాలలో ఘనంగా సత్కరించిన కార్యదర్శి విష్ణువర్ధన్

గుంటూరు కార్పొరేషన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : స్థానిక లక్ష్మీపురంలోని శ్రీ పాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి కేవీఆర్ - జయలక్ష్మి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రతిభ పురస్కారాన్ని అందుకున్నట్లు పాఠశాల సెక్రటరీ, కరెస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. పాఠశాలలో మంగళవారం జరిగిన అభినందన కార్యక్రమంలో విష్ణువర్ధన్ మాట్లాడుతూ నిపుణులైన ఉపాధ్యాయ బృందంతో నాణ్యమైన బోధన అందిస్తున్నందుకు గుర్తుగా తమ పాఠశాలకు సంబంధించిన ఉపాధ్యాయులు ప్రముఖ సంస్థల నుంచి పురస్కారాలను అందుకోవటం ఎంతో గర్వించదగిన విషయమని తెలిపారు. శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి వైస్ ఛైర్‌పర్సన్ కె.రత్నషీలా మణి, మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, ఎమ్మెల్సీ బి.గోపీమూర్తి, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు నుంచి పురస్కారం అందుకున్నారని, ఇది తమ పాఠశాలకే గర్వకారణం అని ఆయన తెలిపారు. పాఠశాల డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణిని విష్ణువర్ధన్‌తో పాటు పాఠశాల పాలక వర్గ సభ్యులు గింజుపల్లి వరప్రసాదరావు, ప్రిన్సిపాల్ దోసకాయల దుర్గాశ్యామ్, కో ఆర్డినేటర్స్ దిల్ జహాన్, టి.శ్రీదేవి, ఇన్‌చార్జి కె.హరిప్రియ, ఇతర ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఈ-బైక్ డిజైన్ పోటీల్లో ఆర్‌వీఆర్ జేసీ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు(విద్య), అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఈ బైక్ పోటీల్లో చౌడవరంలోని ఆర్వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు బహుమతులు సాధించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. రన్నరప్ బహుమతి, మరో 4 విభాగాల్లో ప్రత్యేక పురస్కారాలు అందుకున్నట్లు వెల్లడించారు. కోయంబత్తూరులోని శ్రీరామకృష్ణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో మెక్రాన్ మోటర్స్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన 'నేషనల్ లెవల్ ఈ-బైక్ డిజైన్ ఛాలెంజ్' పోటీల్లో విద్యార్థులు పాల్గొని బహుమతులు సాధించినట్లు వివరించారు. విద్యార్థులను కళాశాల కార్యదర్శి రాయపాటి గోపాలకృష్ణ తదితరులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న రాయపాటి గోపాలకృష్ణ తదితరులు

దీపావళి దుకాణాల ఏర్పాటులో జాగ్రత్తలు తీసుకోవాలి

● కలెక్టర్ అన్సారియా



దీపావళి టపాసుల దుకాణాలపై జరిగిన సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ అన్సారియా

గుంటూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): రానున్న దీపావళి పండుగకు టపాసుల దుకాణాలు ఏర్పాటులో జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా ఆదేశించారు. దీపావళి టపాసుల దుకాణాల ఏర్పాటుపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం మంగళవారం కలెక్టరేట్‌లో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దుకాణాల ఏర్పాటుకు ముందుగా వివిధ బహిరంగ ప్రదేశాలను రెవిన్యూ, పోలీస్, విపత్తులు - అగ్నిమాపక శాఖ సంయుక్తంగా తనిఖీలు నిర్వహించాలన్నారు. వైద్య ఆరోగ్య, అగ్నిమాపక శాఖ తదితర శాఖలు పూర్తిగా అప్రమత్తంగా ఉండి, అన్ని ఏర్పాట్లు ముందుగా చేయాలని ఆదేశించారు. దుకాణదారులు తూచ తప్పకుండా నిబంధనలు పాటించాలని కోరారు. సమావేశంలో ఆర్డీవో శ్రీనివాసరావు, తెనాలి ఇన్‌ఛార్జ్ సబ్ కలెక్టర్ విజయలక్ష్మి తమ రెవెన్యూ డివిజన్‌లో చేపట్టిన అంశాలను వివరించారు. జిల్లా విపత్తులు-అగ్నిమాపక శాఖ అధికారి ఎం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ దుకాణాల ఏర్పాటు నివాస ప్రాంతాలకు, వాణిజ్య సంస్థలు, రహదారులు, జనసాంద్రత ప్రదేశాలకు కనీసం 50 మీటర్లు దూరంలో ఉండాలన్నారు. ఈ సమావేశంలో జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, డీఆర్వో ఎన్ఎస్‌కే ఖాజావలి, డీఎంహెచ్‌వో డాక్టర్ కె.విజయలక్ష్మి, డీపీవో బీవీ నాగ సాయి కుమార్, అదనపు పోలీసు సూపరింటెండెంట్, తహసీల్దార్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పరిశ్రమలకు అనుమతుల మంజూరులో జాప్యం వద్దు

జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు అనుమతుల మంజూరులో జాప్యం ఉండరాదని కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా ఆదేశించారు. జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక మండలి సమావేశం కలెక్టర్ కార్యాలయంలో మంగళ వారం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ సంబంధిత శాఖలు నిర్దేశిత సమయంలో మంజూరు అనుమతులు జారీ చేయాలన్నారు. జిల్లాలో పరిశ్రమల స్థాపనపరంగా వచ్చిన ఏ అవకాశాన్ని వదులుకోరాదని కలెక్టర్ సూచించారు. జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ జయలక్ష్మి మాట్లాడుతూ ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం కింద 26 యూనిట్లను మంజూరు చేయడం జరిగిందని చెప్పారు. ఈ సమావేశంలో జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, డీఆర్వో ఎన్ఎస్‌కే ఖాజావలి, ఆర్డీవో శ్రీనివాసరావు, డీపీవో బీవీ నాగ సాయి కుమార్, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి చెన్నయ్య, డీఆర్‌డీఏ పీడీ టి. విజయలక్ష్మి, కాలుష్య నియంత్రణ మండలి కార్యనిర్వాహక ఇంజనీర్ నజీనా బేగం, జిల్లా విపత్తులు, అగ్నిమాపక శాఖ అధికారి ఎం శ్రీనివాస రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల వినియోగం నివారించాలి

గుంటూరు మెడి కల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలు జీవితాన్ని నాశనం చేస్తాయని, సామాజిక బాధ్యతతో మాదకద్రవ్యాల వినియోగాన్ని నివారించాలని జిల్లా ఈగల్ టీం పోలీస్ అధికారి పోతురాజు కోరారు. నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో మంగళవారం మారుతినగర్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా వర్కర్లు, ఆరోగ్య కార్యకర్తలకు మత్తు పదార్థాలు, సోషల్ మీడియా దుర్వినియోగంపై నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన ప్రసంగించారు. గంజాయి, మాదక ద్రవ్యాలు అమ్మినా కొన్నా చట్టప్రకారం నేరమే అని తెలిపారు. నవజీవన్ సంస్థ జోనల్ కోఆర్డినేటర్ ఎం.కవిత మాట్లాడుతూ ఈ మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన బాలలను, యువతను డీ-ఎడిక్షన్ చికిత్స ద్వారా సాధారణ స్థితికి తీసుకొనిరావచ్చని తెలిపారు. నూజివీడు మండలం పొలసానపల్లిలో ఏర్పాటు చేసిన 'బోస్కో డీ అడిక్షన్ కేంద్రం'లో ఉచితంగా చికిత్సలు అందిస్తారని, 9490492020నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు. నవజీవన్ జోనల్ కోఆర్డినేటర్ జాకబ్ రాజు, ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ టి.కీర్తి, జిల్లా ఈగల్ టీంకు చెందిన పీ కృష్ణా, పి రోశయ్య పాల్గొన్నారు.

రష్మిశెట్టి మరిన్ని విజయాలు సాధించాలి

● డీఆర్ఎం సుధేష్ణ సేన్



రైల్వే టీటీఐ రష్మిశెట్టిని అభినందిస్తున్న డీఆర్ఎం సుధేష్ణ సేన్

గుంటూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): రైల్వేలో ట్రావెలింగ్ టిక్కెట్ ఇన్‌స్పెక్టర్ (టీటీఐ)గా రష్మిశెట్టి విధులు నిర్వహిస్తూ ఇటీవల జరిగిన 64వ జాతీయ ఓపెన్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో జావెలిన్ త్రో విభాగంలో కాంస్య పతకం సాధించడం గుంటూరు రైల్వే డివిజన్‌కి గర్వకారణమని డీఆర్ఎం సుధేష్ణ సేన్ అన్నారు. పట్టాభిపురంలోని రైల్ వికాస్ భవన్‌లో రష్మిశెట్టిని మంగళవారం డీఆర్ఎం అభినందించారు. ఈ సందర్భంగా డీఆర్ఎం మాట్లాడుతూ భవిష్యత్తులో ఆమె మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ అందుకు అవసరమైన సహాయ, సహకారాలు రైల్వే శాఖ పరంగా అందిస్తామన్నారు. క్రీడలను ప్రోత్సహించడంలో రైల్వే ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వే సీనియర్ అధికారులు డాక్టర్ ప్రదీప్‌కుమార్, మద్దాళి రవికిరణ్ పాల్గొన్నారు.

13 గంటల పని విధానాన్ని ఉపసంహరించుకోవాలి

గుంటూరు(తూర్పు), అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 13 గంటల పని విధానాన్ని ఉపసంహరించుకోవాలని రైతు, కౌలు రైతు, ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. స్థానిక లాడ్జీసెంటర్లో సీఐటీయూ నగర కార్యదర్శి కే.శ్రీనివాస్ అధ్యక్షతన ధర్నా కార్యక్రమం నిర్వహించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బి.లక్ష్మణరావు మాట్లాడుతూ మోదీ తీసుకొస్తున్న విధానాలను రాష్ట్రంలో అమలు చేయడం దుర్మార్గమన్నారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి కే.అజయ్‌కుమార్ మాట్లాడుతూ మహిళలు రాత్రి సమయంలో కూడా పని చేయాలనే విధానం సరైనది కాదన్నారు. ఈ కార్యక్రమంలో బి.రామకృష్ణ, బి.ముత్యాలరావు, సలీం, ఎంఎ చిష్టీ, ఎం.సాంబశివరావు, కె.నళినికాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణతో దళితుల ఐక్యత విచ్ఛిన్నం

గుంటూరు(తూర్పు), అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ పేరుతో దళితుల మధ్య చిచ్చు పెట్టే కుట్ర చేస్తున్నారని నేషనల్ ప్రెసిడెంట్ ఫర్ మాల మహానాడు అండ్ రాక్స్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ రత్నాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గుంటూరు అరండల్‌పేటలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్గీకరణ ఫలాలు దేశంలోని 1108 ఎస్సీ కులాలకు ఎలా పంచుతారని ప్రధాని మోదీని ప్రశ్నించారు. ఉమ్మడి రాష్ట్రాల్లో మాల సామాజిక వర్గాన్ని అణగదొక్కుతుంటే ఆ సామాజిక వర్గ ప్రజా ప్రతినిధులు నోరు మెదపకపోవడం దురదృష్టకరమన్నారు. ఈ కార్యక్రమంలో కీర్తి నాయుడు, తుమ్మల ఫ్రాన్సిస్, ప్రేమ్, మేడికొండ సుబ్బయ్య, బత్తుల వీరస్వామి, దుర్గాప్రసాదు, చిన్నం విలియమ్స్ డేవిడ్స్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి హేయం

గుంటూరు(తూర్పు), అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్‌పై దాడి హేయమని వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.జె.విద్యాసాగర్ అన్నారు. గవాయ్‌పై దాడికి నిరసనగా స్థానిక లాడ్జి సెంటర్లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ దాడి వ్యక్తిగతం కాదని భారత రాజ్యాంగంపై సనాతనవాదులు చేసిన దాడి అని విమర్శించారు. అనంతరం వివిధ సంఘాల నాయకులు అరండల్‌పేట పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లి సీజేపై చెప్పు విసరబోయిన వ్యక్తిపై ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో నీలంబరం, ప్రేమ్ జ్యోతి బాబు, డాక్టర్ సుధ, అనిల్‌బాబు, కమలకుమారి, వినయ్‌బాబు పాల్గొన్నారు.

● గుంటూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : జస్టిస్ గవాయ్‌ని లాయరు, సనాతన వాది రాకేష్ కిషోర్ బూటు విసిరి దాడి చేసే యత్నం క్షమించరాని నేరం, అత్యంత దుర్మార్గం అని బీసీ బహుజన ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ నరసింహారావు మంగళవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, ముద్దాయిని వెంటనే అరెస్టు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

● భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్‌పై దాడి ముమ్మాటికీ న్యాయ వ్యవస్థ నైతికతపై దాడి అని వీసీకే పార్టీ రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు కైలే జయసుధ స్పష్టం చేశారు. దాడిని ఖండిస్తూ మంగళవారం స్థానిక లాడ్జి సెంటర్ లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ విగ్రహ ఐలాండ్ వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో బీసీ, ప్రజాసంఘాల నాయకులు ఉగ్గం సాంబశివరావు, గురవయ్య, యంగ్రపాటి సాంబశివరావులతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో జరిగిన మహర్షి వాల్మీకి జయంతిలో పాల్గొన్న కలెక్టర్ అన్సారియా

ఘనంగా మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు

గుంటూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): రామాయణ మహాకావ్యం ద్వారా మానవ సంబంధాలు, నైతిక విలువలు, కుటుంబ బాంధవ్యాలు, ఆదర్శ ప్రజాపాలన తదితర అంశాలను సమాజానికి అందించిన మహాకవి మహర్షి వాల్మీకి అని కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా అన్నారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో మంగళవారం జరిగిన మహర్షి వాల్మీకి జయంతి వేడుకలలో కలెక్టర్‌తో పాటు డీఆర్వో ఖాజావలి, వెనుకబడిన తరగతుల సంక్షేమ సంఘాల నాయకులు పాల్గొని మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రామాయణ ఇతిహాసంలో మహర్షి వాల్మీకి తెలియజేసిన విలువలు, ప్రిన్సిపల్స్‌ను వ్యక్తిగత, ప్రజా జీవితంలో ప్రతి ఒక్కరు ఆచరించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ వై.లక్ష్మీ శైలజగౌడ్, గుంటూరు పార్లమెంట్ విశ్వబ్రాహ్మణ సాధికారిక కమిటీ అధ్యక్షుడు జంపని నాగేశ్వరరావు, టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వేములకొండ శ్రీనివాసరావు, ఏఎన్‌యూ రిటైర్డ్ లైబ్రేరియన్ నాగమణి, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి మయూరి, రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్ రాచకొండ నాగేశ్వరరావు, బీసీ సంక్షేమ శాఖ అధికారులు, ఉద్యోగులు, సంక్షేమ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

తురకపాలెంలో మృతుల కుటుంబాలకు నష్టపరిహారం అందించాలి

● టీడీపీ నేత టీడీ జనార్దన్‌కు మాలమహానాడు విజ్ఞప్తి



టీడీ జనార్దన్‌ను కలిసి విజ్ఞప్తి చేస్తున్న గోళ్ళ అరుణ్‌కుమార్ తదితరులు

గుంటూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): తురకపాలెంలో ఇటీవల జరిగిన వరుస మరణాలతో దిక్కులేని స్థితిలో ఉన్న మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు టీడీ జనార్దన్‌కు మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ళ అరుణ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. మంగళగిరిలోనున్న తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం టీడీ జనార్దన్‌ను మాలమహానాడు నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. రూరల్ మండలం తురకపాలెంలో ఇటీవల మృతి చెందిన 24 మంది మాల కుటుంబాలకు ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ఎటువంటి నష్టపరిహారం అందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాల మహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లెల వెంకటరావు, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గోదా జాన్‌పాల్, గోళ్ళ క్రాంతికుమార్, మెట్ట సునీత తదితరులు ఉన్నారు.

పోలీస్ సిబ్బంది సంక్షేమానికి సహకరిస్తా : ఎస్పీ

గుంటూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ సిబ్బంది సంక్షేమానికి పూర్తి సహాయ, సహకారాలు అందిస్తానని ఎస్పీ వకుల్ జిందాల్ స్పష్టం చేసారు. ఈ మేరకు మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీని జిల్లా పోలీస్ అసోసియేషన్ ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆరోగ్యరాజు (ప్రస్తుత అరండల్ పేట సీఐ), కార్యదర్శి శివ ప్రసాద్ (ప్రస్తుత లాలాపేట సీఐ) ఇతర అసోసియేషన్ అధికారులు ఎస్పీకి అసోసియేషన్ కార్యకలాపాలు, జిల్లా పోలీసు సిబ్బందికి అందిస్తున్న సేవలు, సహాయ సహకారాల గురించి వివరించారు. జిల్లా పోలీసు సిబ్బంది సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించి, పోలీస్ శాఖ తరఫున అందవలసిన అన్ని ప్రయోజనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటామని, అలాగే అసోసియేషన్ సేవలకు పూర్తి స్థాయి సహకారం అందిస్తామని ఎస్పీ వకుల్ జిందాల్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అసోసియేషన్ సీనియర్ ఉపాధ్యక్షుడు సురేష్ (ప్రస్తుత జిల్లా వెల్ఫేర్ ఆర్.ఐ), ఉపాధ్యక్షుడు మైలా సాంబశివరావు (ఏఎస్ఐ), సభ్యులు బేబీ రాణి (ఏఎస్సై), లక్ష్మయ్య (హెడ్ కానిస్టేబుల్) తదితరులు పాల్గొన్నారు.



ఎస్పీ వకుల్ జిందాల్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పోలీస్ అధికారుల సంఘం ప్రతినిధులు

మద్యం దుకాణంలో ఘర్షణ

● ఒకరిపై హత్యాయత్నం

గుంటూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని పలకలూరు రోడ్డులోని కరెంట్ ఆఫీస్ వద్ద గల చిన్న వైన్స్‌లో మందుబాబుల మధ్య మంగళవారం రాత్రి ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణ ఒకరిపై హత్యాయత్నానికి దారితీసింది. పట్టాభిపురం పోలీసుల కథనం మేరకు... మద్యం దుకాణంలో మద్యంసేవించే విషయంలో తుఫాన్ నగర్‌కు చెందిన గోవిందు కిరణ్‌కు, తుఫాన్ నగర్ 5వ లైనుకు చెందిన బన్ను, రూబెన్ కు మధ్య గొడవ జరిగింది. దీంతో బన్ను, రూబెన్‌లు మద్యం సీసా పగలగొట్టి కిరణ్‌ను పొడిచారు. కిరణ్ ముఖం, మెడ, పొట్ట మీద గాయాలయ్యాయి. కిరణ్‌ను వెంటనే జీజీహెచ్‌కు తరలించారు. నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.



సీసీ రోడ్డు, డ్రైయిన్ నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నసీర్

అడగకుండానే వరాలిస్తోన్న ప్రభుత్వం

● తూర్పు ఎమ్మెల్యే నసీర్

● సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన

గుంటూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): అడగకుండానే ప్రజలకు కూటమి ప్రభుత్వం వరాలిస్తోందని తూర్పు ఎమ్మెల్యే నసీర్ చెప్పారు. నియోజకవర్గంలోని సుద్దపల్లి డొంక, యాదవ బజారు, గణేశ్ నగర్‌లో రూ.84 లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ కూటమి ఆధ్వర్యంలో రాష్ట్రంలో ప్రజారంజక పాలన సాగుతోందని చెప్పారు. గత ప్రభుత్వంలో యూజీడీ పనులు ఎక్కడికక్కడ వదిలేయడంతో పాదచారులు కూడా బయటికి రావాలంటే ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. అలాంటి పరిస్థితి నుంచి నగరాన్ని అద్దంలా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. సుమారు 40 ఏళ్ల నుంచి అపరిష్కృతంగా ఉన్న మొండి గేటు వద్ద సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టామన్నారు. వెంట్ వే నిర్మాణ పనులు వేసవిలో ప్రారంభిస్తామని, తద్వారా మురుగు సమస్య శాశ్వత పరిష్కారమవుతుందన్నారు. డిప్యూటీ మేయర్ సజీలా తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు అండగా నిలవాలి

కార్మికులకు టీఎన్టీయూసీ నాయకులు అండగా నిలవాలని ఎమ్మెల్యే నసీర్ సూచించారు. తూర్పు ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గ టీఎన్టీయూసీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరిగింది. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం కార్మిక సంక్షేమానికి కట్టుబడి ఉందని తెలిపారు. నియోజకవర్గంలో కార్మికులకు ఏ సమస్య వచ్చినా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

రేషన్ పంపిణీలో అక్రమాలను సహించేదిలేదు

● పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి



సమావేశంలో మాట్లాడుతున్న పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): రేషన్ పంపిణీ వ్యవస్థలో అక్రమాలను సహించేదిలేదని పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి హెచ్చరించారు. నియోజకవర్గంలో రేషన్ పంపిణీ విధానంపై మంగళవారం ఆమె తన కార్యాలయంలో తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్లతో సమావేశం నిర్వహించారు. రేషన్ సరఫరా, లబ్ధిదారుల వివరాలు, డీలర్ల పనితీరు, నియమ నిబంధనల అమలు వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఆమె మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గంలో ఉన్న 95 రేషన్ షాపులు తమ పరిధిలో ఉన్న లబ్ధిదారులందరికీ సమయానికి సరుకులు అందించాలని స్పష్టం చేశారు. ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదు వచ్చినా, తానే స్వయంగా అధికారులను ప్రశ్నిస్తానని ఆమె హెచ్చరించారు. కొందరు రేషన్ షాపులను వ్యాపార సంస్థల్లా నడుపుతున్నారని, ఇలాంటి ప్రవర్తన అస్సలు సహించమని, డీలర్లు సిండికేట్‌లా వ్యవహరించడం కుదరదని హెచ్చరించారు. నవంబరు నుంచి ఒక్క ఫిర్యాదు కూడా రాకూడదని ఎమ్మెల్యే మాధవి ఆదేశించారు.

రోడ్డుపై ఉన్న విద్యుత్ స్తంభాలను పక్కకు మార్చాలి

రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలను పక్కకు తొలగించాలని విద్యుత్ శాఖ అధికారులను ఎమ్మెల్యే మాధవి ఆదేశించారు. విద్యుత్ అధికారులతో మంగళవారం ఆమె తన కార్యాలయంలో సమీక్ష జరిపారు.

చాకలికుంటను పరిరక్షిస్తాం

పశ్చిమ నియోజకవర్గం 36వ డివిజన్లో ఆక్రమణలకు గురైన చాకలికుంటపై సర్వే జరిపి కుంటను పరిరక్షించాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి టౌన్ ప్లానింగ్ అధికారి నారాయణ స్వామిని ఆదేశించారు. అదే విధంగా కొండయ్య కాలనీలో రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని ఆమె ఆదేశించారు.

నకిలీ మందులను అడ్డుకోవాలి

గుంటూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): నకిలీ మందుల ప్రవేశాన్ని ఉత్పత్తి దశలోనే అడ్డుకోవాలని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి కోరారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో నకిలీ మందులు-దేశ విదేశాల్లో మృత్యువు పాలవుతున్న ప్రజలు' అన్న అంశంపై జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీనియర్ సిటిజన్ అధ్యక్షుడు ఎస్.కృష్ణారావు మాట్లాడుతూ ఇండియాలో లభించే ఔషధాల్లో 25 శాతం నకిలీవేనని గతంలో ఒక అధ్యయనంలో తేలిందన్నారు. ఈ సమావేశంలో అవగాహన సంస్థ సభ్యులు పి భావన్నారాయణ, ఆర్ వెంకటరత్నం ప్రసంగించారు.

వ్యాసరచన పోటీలు

గుంటూరు (విద్య), అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు చౌత్రా సెంటర్లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై మంగళవారం పాఠశాల విద్యార్థినులకు వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన విద్యార్థినులకు పాఠశాల సోషల్ ఉపాధ్యాయులు ఉషా పద్మ, రాబియా బస్రి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సెక్రటరీ రమాదేవి, టీ.శివరత్నశ్రీ, జి.అన్నపూర్ణ, డీ.ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

పశ్చిమలో పోషణమాస ఉత్సవం

గుంటూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): పశ్చిమ నియోజకవర్గంలోని సెక్టార్ మూడులో మంగళవారం పోషణ మాస ఉత్సవం నిర్వహించారు. బోరింగు పంపు సెంటర్లోని అంగన్వాడీ కేంద్రంలో సీడీపీవో అరుణ గర్భిణులు, బాలింతలకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ ఉపాధ్యాయురాలు రమణ రాజేశ్వరి, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు

పశ్చిమ డెల్టాకు 5527 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమడెల్టాకు 5527 క్యూసెక్కులనీరు మంగళవారం విడుదల చేస్తున్నట్లు నీటి పారుదలశాఖ అధికారులు తెలిపారు. ప్రస్తుతం బ్యారేజి వద్ద 12.0 అడు గుల నీటిమట్టం ఉండగా దిగువకు 1,03,000 క్యూసెక్కులనీరు విడుదల చేస్తున్నారు. దుగ్గిరాల సబ్ డివిజన్ నుంచి రేపల్లె కాల్వకు 1001 క్యూసెక్కుల నీరు, తూర్పుకాల్వకు 525, పశ్చిమకాల్వకు 225, నిజాంపట్నంకాల్వకు 185, కొమ్మమూరు కాల్వకు 2700 క్యూసెక్కులనీరు విడుదల చేస్తున్నారు.

యార్డులో పసుపు ధరలు

దుగ్గిరాల పసుపు మార్కెట్‌యార్డులో 186 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు మంగళవారం విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.9,275, గరిష్ఠధర రూ.10,400, మోడల్‌ధర రూ.9,750 పలికాయి. కాయ కనిష్ఠధర రూ.9,275, గరిష్ఠధర రూ.9,750, మోడల్‌ధర రూ.9,750 పలికాయి.

ఇన్నోవా కారును ఢీకొన్న బైక్

● ఒకరి మృతి

ఫిరంగిపురం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఇన్నోవా కారును బైక్ ఢీకొనగా బైక్‌పై ఉన్న వ్యక్తి తీవ్ర గాయాల పాలై గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మంగళవారం మధ్యాహ్నం తాడికొండ మండలం రావెల గ్రామానికి చెందిన కంభాల రత్న సాగర్ తన భార్య సాగరి, కుమార్తె భూమిక కుమారుడు లక్కీ లాజర్లు బైక్‌పై గుంటూరు మీదుగా ఫిరంగిపురం మండలం పొనుగుపాడులో జరిగే చర్చి వార్షికోత్సవానికి బయలుదేరి వస్తున్నారు. బైక్ వేములూరిపాడు శివారు వద్దకు రాగా పిడుగురాళ్ళ నుంచి గుంటూరు వెళ్తున్న ఇన్నోవా కారు ప్రమాదవశాత్తు బైక్‌ను ఢీకొంది. దీంతో బైక్‌పై ఉన్న నలుగురు రోడ్డు పక్కన ముళ్ళ చెట్లలో పడిపోయారు. బైక్ నడుపుతున్న సాగర్‌కు తీవ్ర గాయాలు కాగా భార్య, కుమారుడు, కుమార్తెలకు స్వల్ప గాయాలయ్యాయి. ఇదే సమయానికి కృష్ణా జిల్లాకు చెందిన మరో ద్విచక్ర వాహనదారుడు ప్రమాదవశాత్తు కారును ఢీకొన్నాడు. దీంతో బైక్‌పై నుంచి రోడ్డు పక్క పడగా తీవ్ర గాయాల పాలయ్యాడు. తలకు, కాలికి గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను గుంటూరు జీజీహెచ్‌లో చేర్పించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడని పోలీసులు తెలి పారు.

ద్విచక్రవాహనం తగిలి వ్యక్తి మృతి

ప్రత్తిపాడు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): నడుచుకుంటూ వెలుతున్న వ్యక్తికి బుల్లెట్టు ఢీ కొనడంతో వ్యక్తి మరణించిన ఘటన ఈదులపాలెం వద్ద జరిగింది. ప్రత్తిపాడు పోలీసుల కథనం ప్రకారం పెదనందిపాడు మండలం కొప్పర్రు గ్రామానికి చెందిన చింత సురేష్ (35) ఏడు సంవత్సరాలుగా ఈదుల పాలెం గ్రామంలో నివాసం ఉంటూ కూలిపనులు చేసుకుని జీవనం సాగిస్తుంటాడు. అయితే సోమవారం రాత్రి జాతీయ రహదారి వెంట సర్వీసు రోడ్డులో నడుచుకుంటూ వెలుతున్న సురేష్‌ను బుల్లెట్ ఢీ కొనడంలో గాయాలయ్యాయి. వెంటనే అతన్ని వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మరణించాడు. ఈ మేరకు ప్రత్తిపాడు ఎస్ఐ నరహరి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిలువూరు - కేఆర్‌కొండూరు రోడ్డులో చెత్త తరలింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



శ్రీమహంకాళీ అమ్మవారి ఆలయానికి వెళ్లే రోడ్డులో వేసిన చెత్తను ప్రొక్లెయినర్‌తో శుభ్రం చేయిస్తున్న ఈవో శరత్

దుగ్గిరాల, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): కేఆర్ కొండూరులోని మహం కాళీ అమ్మవారి ఆలయానికి వెళ్లే రోడ్డుపక్కనే భారీగా వేసిన చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను మం గళవారం యుద్ధప్రాతి పదికన తొలగించారు. ఆంధ్రజ్యోతి గుంటూరు రూరల్ పేజీలో డంపింగ్ యార్డులా చిలువూరు - కేఆర్‌కొండూరు రోడ్డు శీర్షికన మంగళవారం ప్రచురితమైన కథనానికి స్పందించిన అధికారులు ఉదయం నుంచే చెత్తను తరలించే కార్యక్రమం ప్రారంభించారు. పంచాయతీ కార్యనిర్వాహక కార్యదర్శి ఎం. శరత్, టీడీపీ నాయకులు చిలువూరు శేషగిరిరావు తదితరులు కేఆర్ కొండూరు రోడ్డు వద్దకు వెళ్లి ప్రొక్లెయినర్ సాయంతో చెత్తను తొలగించి, తరలించారు. కాగా చిలువూరుతోపాటు మరో నాలుగు గ్రామాల్లో చెత్తను సేకరించి, సంపద షెడ్లలో నిల్వచేసి వర్మికంపోస్టు తయారు చేసేందుకు వీలుగా డంపింగ్ యార్డులకు, స్థలాలిచ్చేందుకు స్థానికులు ముందుకు రాకపోవడంతో రోడ్డుపక్కనో, కాల్వల పక్కనో చెత్త వేస్తున్నారని చెబుతున్నారు.

కేఎల్‌యూను సందర్శించిన జర్మనీ ప్రతినిధుల బృందం

తాడేపల్లి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలోని కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీని జర్మనికి చెందిన చెన్నైలోని జర్మన్ కాన్సుల్ జనరల్ మైఖేల్ హాస్పర్ హైదరాబాద్‌లోని జర్మని కాన్సుల్ అమిత్ దేశాయ్‌లు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు కేఎల్‌యూలోని వివిధ విభాగాల ఆచార్యులను పరిశోధకులను కలిసి విద్య, పరిశోధన సహకారాల అవకాశాల గురించి విస్తృత స్థాయిలో చర్చలు జరిపారు. చర్చల తరువాత కాన్సుల్ జనరల్ క్యాంపస్‌లో ఉన్న సౌకర్యాలను చూసి ఆనందాన్ని వ్యక్తం చేశారు. విశ్వవిద్యాలయంలోని వందలాది మంది విద్యార్థులకు జర్మన్ భాషలో శిక్షణ ఇస్తున్నట్టు చూచి ఆశ్చర్యపోయారు. అనంతరం జర్మని ప్రతినిధులను కేఎల్‌యూ వీసీ సారథివర్మ, డీన్ కిషోర్‌బాబులు సత్కరించారు. కార్యక్రమంలో ప్రోవీసీలు ప్రసాద్, రాజశేఖరరావు, వెంకట్రామ్, అంతర్జాతీయ సంబంధాల డీన్ కిషోర్‌బాబు, డైరెక్టర్ విజయ్‌మారుతి, విదేశీ భాషల విభాగాధిపతి జమిందార్ తదితరులు పాల్గొన్నారు.

ఆశావర్కర్ల వేతనాలు పెంచి, సంక్షేమ పథకాలు వర్తింపచేయాలి

దుగ్గిరాల, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్ల వేతనాలను పెంచాలని, జీఎన్ఎం శిక్షణ పొందిన వర్కర్లకు ఆశవర్కర్లుగా గుర్తించి పోస్టింగ్ ఇవ్వాలని, అదనపు పనుల నుంచి ఆశావర్కర్లకు మినహాయింపు ఇవ్వాలని, కోరుతూ ఈమని పీహెచ్‌సీ వద్ద ఆశా వర్కర్లు సీహెచ్ఎన్ సునీతకు వినతిపత్రం మంగళవారం అందించారు. సీపీఎం మండల కార్యదర్శి జెట్టి బాలరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆశావర్కర్లు, తమ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు.

● తాడేపల్లి టౌన్: ఆశావర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయడంతోపాటు అన్ని రకాల జాతీయ పండుగలకు సెలవులు ఇవ్వాలని ఆశావర్కర్స్ జిల్లా యూనియన్ కార్యదర్శి కొప్పనాతి లక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ప్రకాష్ నగర్ డ్రైవర్ కాలనీ పీహెచ్‌సీ వద్ద ఆశావర్కర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో తమ డిమాండ్ల సాధనకోసం ధర్నా చేశారు.

● మేడికొండూరు : ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండల ఆశా వర్కర్ యూనియన్ ఆధ్వర్యంలో మేడికొండూరు పీహెచ్‌సీ వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. మండల అధ్యక్షురాలు సుజాత, ఆశావర్కర్లు, పాల్గొన్నారు.

తిరోగమన భావాలు తిప్పికొట్టండి

● ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శ్రీనివాసకుమారి

తాడేపల్లిటౌన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): సమాజంలో వేళ్లూనికుని ఉన్న తిరోగమన భావాలను మహిళలు తిప్పికొట్టాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళాసంఘం(ఐద్వా) రాష్ట్ర ఉపాధ్యక్షురాలు దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి పిలుపునిచ్చారు. మంగళవారం తాడేపల్లి పట్టణంలోని సుందరయ్యనగర్ లీలా సుందరయ్య కళావేదిక (బూరుగ సరస్వతి ప్రాంగణం) వద్ద ఐద్వా తాడేపల్లి పట్టణ 6వ మహాసభ కార్యదర్శి గిరిజ అధ్యక్షతన నిర్వహించారు. తొలుత ఐద్వా పతాకాన్ని బాలబొమ్మల లక్ష్మి ఆవిష్కరించి మహిళా ఉద్యమ నాయకురాలు మానికొండ సూర్యావతి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసకుమారి మాట్లాడుతూ మతోన్మాద ప్రైవేటీకరణ విధానాలతో మహిళలకు భద్రత కరువైందని వివరించారు. ఐద్వా అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

నృసింహుడి హుండీ ఆదాయం రూ.48.45 లక్షలు

మంగళగిరి సిటీ, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మంగళాద్రి శ్రీలక్ష్మీ నృసింహ స్వామి దేవస్థానంలో భక్తులు సమర్పించిన కానుకల హుండీలను మంగళవారం లెక్కించారు. ఎగువ సన్నిధిలోని హుండీల ద్వారా రూ.19,91,221లు, దిగువ సన్నిధిలోని హుండీల ద్వారా రూ.26,96,884లు, ఉపాలయమైన ఘాట్‌రోడ్డులోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం హుండీల ద్వారా రూ.72,371లు, నిత్యాన్నదాన పథకం కింద రూ.85,089లు వెరసి మొత్తం రూ.48 లక్షల 45 వేల 565 లు ఆదాయంగా వచ్చినట్టు దేవదాయ శాఖ సహాయ కమిషనర్, ఆలయ ఈవో కే.సునీల్‌కుమార్ తెలిపారు. హుండీల లెక్కింపును పొన్నూరు శ్రీసహస్ర లింగేశ్వరస్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి జీవీ అమర్‌నాథ్ పర్యవేక్షించారు. దేవస్థానం సిబ్బంది, భక్త బృందం ప్రతినిధులు లెక్కింపులో పాల్గొన్నారు.

రోలర్ స్కేటింగ్ పోటీలకు వడ్డేశ్వరం విద్యార్థులు

తాడేపల్లి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా 20వ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్ ఆర్ఎస్ఏజీ ఆధ్వర్యంలో గుంటూరులో అక్టోబరు 5, 6 తేదీల్లో 20వ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారు. సీనియర్ విభాగంలో వడ్డేశ్వరం జడ్పీ హైస్కూల్ 8వ తరగతి విద్యార్థి జి.సాయినవనీత్ స్కేటింగ్ పోటీల్లో జిల్లాలో గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించి ఈ నెల 25, 26 తేదీలలో కాకినాడలో జరిగే రాష్ట్ర స్థాయిలో పోటీల్లో పాల్గొంటాడని జడ్పీ హైస్కూల్ హెచ్ఎం కాకుమాను జోజప్ప తెలిపారు. ఎంపికైన విద్యార్థిని వ్యాయామ ఉపాధ్యాయులు మెల్లంపూడి రవి, నూతక్కి రవి, గ్రామ పెద్దలు అభినందించారు.

మాజీ ఎంపీపీ కే సుశీల గుండె పోటుతో మృతి



సుశీల(ఫైల్ ఫొటో)

ఫిరంగిపురం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లపాలెం గ్రామానికి చెందిన కార్యంశెట్టి సుశీల(67) సోమవారం గుండె పోటుతో మృతి చెందారు. 2014 - 2017 వరకు మండల పరిషత్ అధ్యక్షురాలిగా ఆమె పని చేశారు. సుశీల భర్త యోహాన్ తెలుగుదేశం పార్టీకి గతంలో మండల అధ్యక్షుడిగా పని చేశారు.

● మంగళవారం ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ సుశీల అంత్యక్రియల్లో పాల్గొన్నారు. అనంతరం కుటుంబసభ్యులకు సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మండవ నరసింహారావు, కొత్తపల్లి కోటేశ్వరరావు, పసల థామస్, బందనాథం సతీష్, హృదయరాజు తదితర నాయకులు పాల్గొన్నారు.

విద్యా రంగానికి సూపర్ గిఫ్ట్ జీఎస్టీ

వట్టిచెరుకూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : విద్యా రంగానికి, విద్యార్థులకు సూపర్ గిఫ్ట్ ఇచ్చిన ఘనత ఎన్‌డీఏ ప్రభుత్వానిది సాహసోపేతమైన నిర్ణయమని జీఎస్టీవో వై పద్మజ హర్షం వ్యక్తం చేశారు. జీఎస్టీపై మండలంలోని హైస్కూల్స్ స్కూల్స్‌లో మంగళవారం జీఎస్టీ కార్యాలయ పట్టణం బజారు ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వై పద్మజ, ఏఈవో కలాంలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్ బాబు, ఎంఈవో జీ సత్యనారాయణమూర్తి, సూపరింటెండెంట్ హేమంత్, హెచ్ఎంలు జాస్మిన్, జోష్ మేరి తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

మంగళగిరి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ కమిటీని ఎన్నుకున్నట్టు మంగళవారం ప్రకటించారు. అధ్యక్షుడిగా రాజేష్, ఉపాధ్యక్షులుగా శ్రావణ్‌కుమార్, రాజ్‌కుమార్, కార్యదర్శిగా శ్రీరామ్, సహాయ కార్యదర్శిగా తరుణ్, కోశాధికారిగా సతీశ్, మరికొందరు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

సాంకేతిక విద్యలో ప్రాంతీయ భాషలకు ప్రోత్సాహం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైవీ ఆంజనేయులు, అధ్యాపకులు

తాడికొండ(మోతడక), అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): సాంకేతిక విద్యలో ప్రాంతీయ భాషల వినియోగాన్ని ప్రోత్సహించడానికి ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ పథకాన్ని ప్రారంభించిందని చలపతి విద్యా సంస్థల ఛైర్మన్ వైవీ ఆంజనేయులు తెలిపారు. ఫ్యూచర్ స్మార్ట్ సిటీ ఇంటిలిజెంట్ మొబిలిటి అనే అంశంపై ఈనెల 17, 18 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి సెమినార్ పోస్టర్స్‌ను మోతడక చలపతి ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక విద్యలో భారతీయ భాషల వినియోగాన్ని ప్రోత్సహించడం, ప్రాంతీయ భాషల్లో జ్ఞానాన్ని వ్యాప్తి చేయడం దీని ప్రధాన ఉద్దేశమని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ అండ్ కార్యదర్శి వై.సుజిత్‌కుమార్, ప్రిన్సిపాల్ కొల్లా నాగ శ్రీనివాసరావు, డీన్ ఆఫ్ ఎగ్జామ్స్ వీ.వీ.సుబ్బారావు, పీ. బాలమురళీకృష్ణ, నాగమల్లేశ్వరరావు, జీ.రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిశోధనాత్మక దృక్పథానికి ఏసీఎం దోహదం

వట్టిచెరుకూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఏసీఎం వంటి అంతర్జాతీయ వేదికలు విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించటమే కాకుండా పరిశోధనాత్మక దృక్పథాన్ని పెంచుతాయని డాక్టర్ ఎం శ్రీలత అన్నారు. మండలంలోని వింజనంపాడు గ్రామ సమీపంలోని కిట్స్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ క్లబ్ అసోసియేషన్ ఫర్ కంప్యూటింగ్ డిక్సనరీ శాఖ ప్రారంభోత్సవ కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ ఎం శ్రీలత హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఏసీఎం శాఖ ద్వారా విద్యార్థులకు లభించే ఫలితాలను వివరించారు. కళాశాల ఛైర్మన్ కోయ సుబ్బారావు, సెక్రటరీ కోయ శేఖర్, కళాశాల డైరెక్టర్ కే హరిబాబు, ప్రిన్సిపాల్ పీ బాబు ప్రసంగించారు. కార్యక్రమంలో విభాగాధిపతి జీ మురళీ, ఏసీఎం క్లబ్ కో-ఆర్డినేటర్ ఎస్ రాధాకృష్ణన్ ఏసీఎం లక్ష్యాలు, రాబోయే కార్యకలాపాలను వివరించారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

మంగళగిరి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చాంద్ బాషా కోరారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజలకు అన్నీ ఇస్తుందని, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను మాత్రం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 12వ వేతన సవరణ కమిటీని నియమించాలని, 28 శాతం ఐఆర్ ప్రకటించాలని, సీపీఎస్ విషయంపై క్లారిటీ ఇవ్వాలని, పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

చెంచుపేటలో సినిమా షూటింగ్

తెనాలి అర్బన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చెంచుపేట చావాస్ కల్యాణ మండపంలో మంగళవారం సినిమా షూటింగ్ జరిగింది. రూరల్ మండలం నందివెలుగుకు చెందిన కోటా లక్ష్మీకోటేశ్వరరావు గోల్డెన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సినిమా నిర్మిస్తున్నారు. హైదరాబాద్‌లో షూటింగ్ జరుపుకుంటూ తమ సొంత ప్రాంతంలో కూడా షూటింగ్ చేయాలనే ఉద్దేశ్యంతో కొన్ని సన్నివేశాలను ఇక్కడ చిత్రీకరిస్తున్నట్లు నిర్మాత చెప్పారు. యువ దర్శకుడు జంపన్న దర్శకత్వంలో వివాహ సన్నివేశాలను చిత్రీకరించారు. సన్నివేశాలలో హీరో గగన్‌బాబు, సినీనటుడు పృథ్వీ, సూర్య తదితరులు నటించారు. ఈ సినిమాలో వరణ్‌సందేశ్ కూడా ప్రధాన పాత్ర పోషిస్తున్నారని తెలిపారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

12న మెగా కంటి వైద్య శిబిరం

తెనాలి క్రైం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శ్రీవాసవీ సేవా సమితి, శంకర కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 12న ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు శ్రీవాసవీ సేవా సమితి సభ్యులు మంగళవారం తెలిపారు. బస్టాండ్ సమీపంలోని ఆర్యవైశ్య విద్యానిధి హాస్టల్ ప్రాంగణంలో దీన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. శిబిరానికి వచ్చేవారు తమ వెంట ఆధార్ కార్డు తెచ్చుకోవాలని కోరారు.

అత్తమామల వేధింపులపై కేసు

తెనాలి క్రైం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): అత్తమామలు వేధింపులకు గురిచేస్తున్నారంటూ నాజరుపేట జంధ్యాలవారి వీధికి చెందిన బడే రమ్య పోలీసులను ఆశ్రయించింది. అత్త బడే వసుమతి, మామ శ్రీనివాసరావు, ఆడపడుచులు కోలా చిన్మయలక్ష్మి, చొప్పరపు యామిని తనను వేధింపులకు గురిచేస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేసింది.

పాస్టర్ల గౌరవ వేతనంపై సీఎం ప్రకటన హర్షణీయం

● ప్రొఫెసర్ జోసఫ్ మోసిగంటి

పొన్నూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాస్టర్ల గౌరవ వేతనం విడుదల చేయాలని ఆదేశించటం హర్షణీయమని ఆంధ్రప్రదేశ్ క్రైస్తవ సంఘాల నాయకుడు ప్రొఫెసర్ జోసఫ్ మోసిగంటి మంగళవారం అన్నారు. సోమవారం జరిగిన మైనారిటీశాఖ సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి క్రైస్తవ సమాజానికి చేస్తున్న మంచిని వివరించారన్నారు. క్రైస్తవ సమాజానికి క్రిస్టియన్ కార్పొరేషన్ చైర్మన్‌ను తక్షణమే నియమించి క్రైస్తవ సమాజ అభివృద్ధికి, సంక్షేమానికి పాటుపడాలని ముఖ్యమంత్రికి జోసఫ్ విజ్ఞప్తి చేశారు.

గంజాయితో పట్టుబడిన వ్యక్తులకు జైలు

తెనాలి క్రైం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): గంజాయితో పట్టుబడిన వ్యక్తులకు జైలుశిక్ష విధిస్తూ మంగళవారం ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి ఎ.పవన్‌కుమార్ తీర్పు వెలువరించారు. 2021 అక్టోబరు 16న పెదరావూరు సెంటర్ వద్ద పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ముత్తింశెట్టిపాలెంకు చెందిన గంటలపల్లి పూర్ణచందు, సీఎం కాలనీకి చెందిన మొగలి సాయి 500గ్రాముల గంజాయితో దొరికారు. విచారణలో కేసు నిరూపణ కావడంతో వారికి మూడు నెలల జైలు శిక్ష రూ.వెయ్యి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. అప్పటి తెనాలి రూరల్ ఎస్ఐ సి.సుబ్రహ్మణ్యం ఈ కేసును దర్యాప్తు చేసి చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టు ప్రక్రియలో ప్రాసిక్యూషన్ తరపున సీనియర్ ఏపీపీ పరిశపోగు సునీల్ కుమార్ వాదనలు వినిపించారు. కోర్టు పర్యవేక్షణాధికారి, సీఐ నరసింహారావు ఆధ్వర్యంలో హెడ్ కానిస్టేబుల్ వి.శ్రీనివాసరావు, ప్రస్తుత తెనాలి రూరల్ ఎస్ఐ ఆనంద్ పర్యవేక్షించారు.

సాహిత్య రంగానికి తుమ్మల సేవలు ఎనలేనివి: శ్రీదేవి

తెనాలి అర్బన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): సాహిత్య రంగంలో తుమ్మల వెంకట్రామయ్య చేసిన సేవలు ఎనలేనివని ఇస్కఫ్ కార్యదర్శి శ్రీదేవి పేర్కొన్నారు. గాంధీనగర్‌లోని ఇస్కఫ్ కార్యాలయంలో మంగళవారం తుమ్మల జయంతి నిర్వహించారు. గాయని అనురాధ అధ్యక్షతన జరిగిన సభలో శ్రీదేవి మాట్లాడుతూ, కమ్యూనిస్టు సిద్ధాంతాలను ప్రచారం చేయడంతో పాటు పత్రికా సంపాదకునిగా, అనువాదకునిగా, రచయితగా బహుముఖ ప్రజ్ఞ పాటవాలు కలిగిన తుమ్మల వెంకట్రామయ్య సమాజానికి ఆదర్శంగా నిలిచారని చెప్పారు. రాజకీయ పాఠశాల ఏర్పాటు చేసి రచయితల్లో అభ్యుదయ భావాలను పెంపొందించారని అన్నారు. బంగ్లాదేశ్ విముక్తి పోరాటంలో ఆయన రాసిన గీతం బహుళ ప్రచారం పొందిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో బొల్లిముంత కృష్ణ, విజయదుర్గ, మౌనిక, విజయలక్ష్మి తదితరులు పాల్గొని తుమ్మల చిత్రపటానికి నివాళులర్పించారు.


సర్టిఫికెట్ అందుకుంటున్న ప్రజ్ఞాచారి

శతక సాహిత్యంతో మనో వికాసం కలుగుతుంది

● సాహిత్యవేత్త పూర్ణ ప్రజ్ఞాచారి

తెనాలి అర్బన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): శతక సాహిత్యాన్ని భాషా బోధనగా అమలుచేస్తే మనోవికాసం కలుగుతుందని సాహిత్యవేత్త పూర్ణప్రజ్ఞాచారి అన్నారు. కొలకలూరుకు చెందిన నూతక్కి పూర్ణ ప్రజ్ఞాచారి మంగళవారం పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురంలో జరిగిన జాతీయ సదస్సులో పాల్గొన్నారు. బీఈడీ కళాశాల ఆధ్వర్యంలో తెలుగు సాహిత్యం, భాషా బోధన వికాసం అనే అంశంపై సదస్సులో పరిశోధన పత్రాలను ఆహ్వానించారు. శతక సాహిత్యం, బాషా బోధన, మనో వికాసం అనే అంశంపై ఆయన పరిశోధన పత్రాలను సమర్పించారు. ఆయన పరిశోధన పత్రాలు పరిశీలించి నిర్వాహకులు అభినందన సర్టిఫికెట్ అందజేసి సత్కరించారు.

అధ్వానంగా తక్కెళ్లపాడు-పెదకాకాని డొంక


అధ్వానంగా ఉన్న పంట పొలాలకు వెళ్లే డొంక

▸▸ రెండు గ్రామాల పంట పొలాలకు ప్రధాన లింకు రోడ్డు
▸▸ కొన్నేళ్లుగా మరమ్మతులకు నోచుకోని రహదారి
▸▸ డొంకను అభివృద్ధి చేయాలని రైతుల విజ్ఞప్తి

పెదకాకాని, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): పంట పొలాలకు వెళ్లే డొంక అధ్వాన స్థితిలో ఉంది... గత కొన్నేళ్ళుగా ఈ రహదారి గురించి పట్టించుకోకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు... పెదకాకాని, తక్కెళ్ళపాడు పంట పొలాలకు ఉన్న ఈ లింకు రోడ్డు ఎంతో ప్రధానమైనది. రెండు గ్రామాల రైతులకు ఎంతో ఉపయోగకరమైన ఈ రహదారి గత కొన్నేళ్లుగా పట్టించుకోకపోవడంతో రైతులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. పెదకాకానిలోని పుష్పరాజు కాలనీ నుంచి గుంటూరు కెనాల్ మీదుగా తక్కెళ్లపాడు వెళ్లేందుకు రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. ఈ లింకు రోడ్డును అనుకొని వేలాది ఎకరాల భూములు తక్కెళ్లపాడు, పెదకాకాని రైతులు సాగు చేస్తున్నారు. రైతులు వ్యవసాయ పనిముట్లు, పండిన పంట ఇంటికి తీసుకువెళ్లేందుకు ఏకైక మార్గం ఈ రహదారి మాత్రమే. ఇంతటి ప్రాధాన్యం కలిగిన ఈ రహదారికి మరమ్మతులు చేపట్టాలని తక్కెళ్లపాడు, పెదకాకాని గ్రామాల రైతులు వేడుకుంటున్నారు.

ఆస్పత్రిలో పారిశుధ్యం మెరుగుపరచాలి

● నిడుబ్రోలు ఆస్పత్రి తనిఖీలో కలెక్టర్ ఆదేశాలు


నిడుబ్రోలు ప్రభుత్వ ఆసుపత్రిలో సౌకర్యాలపై రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

పొన్నూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాస్పత్రిలో పారిశుధ్యం మెరుగుదలకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్‌అన్సారియా ఆదేశించారు. నిడుబ్రోలు క్లస్టర్ ప్రభుత్వ ఆస్పత్రిని మంగళవారం రాత్రి కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో పలు వైద్య విభాగాలను, రోగుల రికార్డులను పరిశీలించారు. అందుతున్న సేవలు గురించి రోగులతో నేరుగా మాట్లాడారు. అనంతరం వైద్యులతో సమావేశమై ఆస్పత్రి అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, సమస్యల గురించి ఆరా తీశారు.

అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఆస్పత్రికి డిప్యూటేషన్‌పై గైనకాలజిస్టును నియమించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అంబులెన్స్ సమకూర్చేందుకు సహాయ సహకారాలు అందించనున్నట్లు చెప్పారు.

ఘన వ్యర్థాల నిర్వహణపై కార్యదర్శులకు శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

చేబ్రోలు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు గ్రామపంచాయతీలో ఘన వ్యర్థాల నిర్వహణ, పరిశుభ్రత, పచ్చదనంపై పంచాయతీ కార్యదర్శులకు మంగళవారం మాస్టర్ ట్రైనర్స్ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. చేబ్రోలు శిక్షణా కేంద్రంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి టి. ఊహారాణి మాట్లాడుతూ, గుంటూరు జిల్లాలోని 16 మండలాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులను ఎంపిక చేసి మాస్టర్ ట్రైనర్స్‌గా ఈ శిక్షణను ఇచ్చామని చెప్పారు. శిక్షణ పొందిన అధికారులు తమ స్థానిక మండలాల్లోని పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించనున్నారని చెప్పారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా పంచాయతీ అధికారి వి.వి.ఎన్.సాయికుమార్ మాట్లాడుతూ, గ్రామాల్లో పరిశుభ్రత, పచ్చదనం, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణ పై శిక్షణ ద్వారా పూర్తిగా అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఈ శిక్షణలో ఇంటింటి ఘన వ్యర్థాల సేకరణ, వేరుచేయడం, వాటి ద్వారా సంపద సృష్టి, పారిశుధ్య కార్మికుల వినియోగం, వారి హక్కులు మరియు ప్రభుత్వ సంక్షేమ పథకాల అర్హతలపై వివరించారు. శిక్షణ వనరుల వ్యక్తులుగా జిల్లా పంచాయతీ వనరుల కేంద్ర రిసోర్స్ పర్సన్ కె. అనురాధ, జిల్లా శిక్షణ మేనేజర్ కె. నాగేశ్వరరావు వ్యవహరించారు.ఈ కార్యక్రమంలో ఈటీసీ బాపట్ల ఫాకల్టీ కె.లలిత, డిపూటీ ఎంపీడీవో ఎం.రవిశంకర్, ఎంసీవో ఎస్‌బీఎంజీ ప్రసాద్, మాస్టర్ ట్రైనర్స్ మరియు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


ఎలుకల నివారణ మందు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

సామూహిక చర్యలతోనే ఎలుకల నివారణ

పొన్నూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): సామూహిక నివారణ చర్యలతోనే ఎలుకలను సమర్థవంతంగా అరికట్టవచ్చని ఏడీఏ వీ రామకోటేశ్వరి అన్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మండల పరిధిలోని అన్ని రైతు సేవా కేంద్రాల వద్ద సామూహిక ఎలుకల నియంత్రణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజనల్ పర్యవేక్షణ అధికారి సీహెచ్ తిరుమలదేవి స్థానిక ఏడీఏ వి.రామకోటేశ్వరి పర్యవేక్షణలో బ్రోమోడయోలిన్ మందులు తయారుచేసి రైతులకు మందు తయారీపై అవగాహన కల్పించారు. 10గ్రాముల పొట్లాలు చొప్పున కట్టించి మందులు ఎలుకల బొరియలు వద్ద విడిచిపెట్టారు. ఒకేసారి రైతులందరూ సామూహికంగా ఈ చర్యలను ప్రారంభించడం ద్వారా ఎలుకలన్నీ సమూలంగా నివారించే అవకాశం ఉందని అధికారులు సూచించారు. రైతులకు ఎలుకల వల్ల జరిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో రైతులకు ఉచితంగా మందు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాల వెంకటేశ్వరరావు, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ బండ్లమూడి బాబురావు, మునిపల్లె సొసైటీ అధ్యక్షుడు గూడూరు శేషగిరిరావు, డీసీ చైర్మన్ గనిపిశెట్టి రామకృష్ణ, సొపాటి వెంకటరావు, వ్యవసాయ అధికారి ఆర్.వెంకటేశ్వరరావు, విస్తరణ అధికారి ఐ.శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

కొల్లిపరలో...

కొల్లిపర, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): రైతులు సామూహికంగా ఎలుకలను నివారించుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎస్.శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని అత్తోట, మున్నంగి గ్రామాల్లో ఎలుకల నివారణపై వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. బ్రోమోడయోలిన్ ఎలుకల మందును నూకలు, నూనెలో కలిపే విధానాన్ని వ్యవసాయాధికారులు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ వేమూరి దీనమ్మ, ఉపసర్పంచ్ ఆళ్ళ శివనాగిరెడ్డి, రైతులు కొఠారు అంజనేయులు, దాసరి నరసయ్య పాల్గొన్నారు.

● చేబ్రోలు: మండలంలోని నారాకోడూరు గ్రామంలో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సామూహిక ఎలుకల నియంత్రణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏడీఏ రామకోటేశ్వరి, ఏవో పి.ప్రియదర్శిని, ఏడీఏ తిరుమలదేవి, టీడీపీ మండల అధ్యక్షుడు మైలా వెంకట రామరాజు, ఏఈవో మోహన్, గ్రామ ఉద్యాన సహాయకుడు విజయ్ కుమార్, ఏపీఎంఐ పి.కోటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి అబ్దుల్ అజీజ్, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.



మున్నంగిలో నిరసన వ్యక్తం చేస్తున్న ఆశా వర్కర్లు

ఆశా వర్కర్లకు కనీస వేతనం చెల్లించాలి

● సీఐటీయూ సీనియర్ నాయకుడు శివసాంబిరెడ్డి

కొల్లిపర, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్లకు కనీస వేతనం చెల్లించాలని సీఐటీయూ సీనియర్ నాయకుడు ములకా శివసాంబిరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మున్నంగిలో తమ సమస్యల సాధన కోసం ఆశా వర్కర్లు సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్ మండల కార్యదర్శి ఎం.జయప్రద, యూనియన్ నాయకులు ప్రసన్నకుమారి, శివలీల, తిరుపతమ్మ, లంక పద్మ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

● పెదకాకాని: ఆశ వర్కర్లకు కనీస వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వై నేతాజీ డిమాండ్ చేశారు. మంగళవారం ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో పెదకాకాని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆశా కార్యకర్తలతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నేతాజీ మాట్లాడుతూ కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశా వర్కర్లుగా మార్పు చేయాలన్నారు. అనంతరం పెదకాకాని, వెనిగండ్ల మెడికల్ ఆఫీసర్లకు మెమోరాండం అందజేశారు. కార్యక్రమంలో ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు కే కుమారి, టి రాధిక, టి సీతారామ కుసుమ, ఎం ఇందిరా, షేక్ మరింబి, ఎస్ జ్యోతి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులకు యాప్‌పై అవగాహన


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ అప్పలనాయుడు

తెనాలి అర్బన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం సచివాలయ ఉద్యోగులకు యాప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ అప్పలనాయుడు మాట్లాడుతూ, సచివాలయ ఉద్యోగులంతా ప్రభుత్వం అప్పగించిన పనులను సకాలంలో నిర్వహించాలన్నారు. ఏపీసీ ఎంఎంఎస్ యాప్ వినియోగించే విధానాన్ని వివరించారు. విధులకు సకాలంలో హాజరు కావాలని అశ్రద్ధ వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇంజనీరింగ్ అధికారులు ఎ.శ్రీనివాస్, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు

రాజధాని అభివృద్ధికి సలహాలు అందించాలి

● మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు

పొన్నూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఇచ్చే సలహాలు సూచనలు రాజధాని ప్రాంత అభివృద్ధికి దోహదపడతాయని మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్ బాబు అన్నారు. స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో మంగళవారం సీఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్ రూపకల్పనపై ఆర్‌వీ ఇంజనీరింగ్ అసోసియేషన్ సంస్థ ప్రతినిధులు ప్రజల అభిప్రాయాలను స్వీకరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కమిషనర్ రమేష్‌బాబు మాట్లాడుతూ, ప్రజలు అమూల్యమైన సలహాలు ప్రజా రాజధాని నిర్మాణానికి ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఆకుల సాంబశివరావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ అహ్మద్‌ఖాన్, పఠాన్ ఫిరోజ్‌ఖాన్, షేక్ బాజీ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మగ్బుల్ బేగ్, కూటమి పార్టీల నాయకులు పట్టణ ప్రముఖులు వివిధ వర్గాల ప్రజలు టౌన్ ప్లానింగ్ అధికారి రఘురాం, ఆర్వో వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

తెనాలిలో కోర్టు విధులకు న్యాయవాదుల గైర్హాజరు

తెనాలి క్రైం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్‌పై కాలిబూటుతో దాడికి యత్నించిన న్యాయవాది రాకేశ్ కిషోర్‌పై చర్యలు తీసుకోవాలని తెనాలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్ కోరారు. దీనికి నిరసనగా మంగళవారం న్యాయవాదులు కోర్టు విధులకు గైర్హాజరై నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అన్నం పిన్నారావు, కార్యదర్శి గౌరీశంకర్, సీనియర్ న్యాయవాదులు తాడిబోయిన శ్రీనివాసరావు, మద్ది మల్లిఖార్జునరావు, ఏఐఎఫ్ జిల్లా అధ్యక్షుడు దాసరి శ్రీధర్, రవిరాజు, వేములపల్లి శ్రీనివాస్, అబ్దుల్ ఆరీఫ్, కుటుంబరావు, కె.ప్రకాశ్, బెన్‌హర్, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

సిబార్‌లో రేపటి నుంచి దంత వైద్య వైజ్ఞానిక ప్రదర్శన

పెదకాకాని, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): సిబార్ దంత వైద్య కళాశాల రజతోత్సవాలను పురస్కరించుకొని ఈ నెల 9 నుంచి 15వ తేదీ వరకు దంత వైద్య వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్లు సిబార్ దంత వైద్య కళాశాల డీన్ డాక్టర్ లింగమనేని కృష్ణ ప్రసాద్ తెలిపారు. ప్రదర్శనలో దంత విభాగాలకు సంబంధించిన అన్ని సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని చెప్పారు. ప్రజలకు కాస్మెటిక్ చికిత్సలు మినహా మిగతా అన్నిరకాల దంత వైద్య చికిత్సలు ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. సమావేశంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ తోట కృష్ణమోహన్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమణారెడ్డి, పబ్లిక్ హెల్త్ డెంటిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అసంఘటిత కార్మికులకు లబ్ధి చేకూరుస్తాం

● టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు హరిప్రసాద్

తెనాలి క్రైం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని అసంఘటిత కార్మికులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల లబ్ధి అందేలా చర్యలు తీసుకుంటామని మంగళవారం తెనాలి నియోజకవర్గ టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్ అన్నారు. ప్రభుత్వం అందించే వివిధ పథకాలపై సరైన అవగాహన లేకపోవడంతో అసంఘటిత కార్మికులు వాటిని వినియోగించుకోలేక పోతున్నారని పేర్కొన్నారు. వాటిపై అవగాహన కల్పించి లబ్ధి పొందే విధంగా అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ శివప్రసాద్‌తో చర్చలు జరపామని చెప్పారు. త్వరలో వాటిపై ప్రచారం నిర్వహించి కార్మికులకు అందుబాటులోకి తీసుకొస్తామని హరిప్రసాద్ తెలిపారు.

చేబ్రోలు కళాశాలలో బోర్డు డైరెక్టర్ ఆకస్మిక తనిఖీ


తనిఖీలో పాల్గొన్న బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్

చేబ్రోలు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, సెక్రటరీ శ్రీనారాయణ భరత్ గుప్తా, ఐఏఎస్ మంగళవారం ఎస్.ఎన్.ప్రభుత్వజూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీ సందర్భంగా డైరెక్టర్, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులతో సమావేశమై కళాశాలలోని వసతులు, బోధన విధానం, పరీక్షా విధానం, ఫలితాలు వంటి అంశాలపై సమీక్ష నిర్వహించారు. విద్యాప్రమాణాలు మెరుగుపరచడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె. సుచరిత పలు వివరాలు తెలియజేశారు.


కొల్లిపరలో వాల్మీకి మహర్షి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి

కొల్లిపర, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కొల్లిపర మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎండీవో విజయలక్ష్మి మాట్లాడుతూ వెనుకబడిన తరగతుల సంక్షేమం కోసం వాల్మీకి మహర్షి కృషి చేసినట్లు తెలిపారు. మహాకవి వాల్మీకి మహర్షి జీవితం స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో భార్గవ్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసమూర్తి, ఏపీవో వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రమైన చేతులతో ఆరోగ్యం

● జిల్లా మలేరియా అధికారి మురళీకృష్ణ

తెనాలి అర్బన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): చేతులను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యంగా ఉంటారని జిల్లా మలేరియా అధికారి టి.మురళీకృష్ణ చెప్పారు. స్థానిక కొత్తపేటలోని ట్రైబల్ వెల్ఫేర్ బాలుర హాస్టల్‌లో మంగళవారం నిర్వహించిన మెడికల్ క్యాంపులో పాల్గొన్నారు. అపరిశుభ్ర చేతుల ద్వారానే బ్యాక్టీరియా, వైరస్ శరీరంలోకి ప్రవేశించి వ్యాధులకు కారణమవుతాయన్నారు. ఏదైనా ఆహారం తీసుకునే ముందు, టాయిలెట్స్ వినియోగించిన తరువాత తప్పనిసరిగా చేతులను శుభ్రపరచుకోవాలని చెప్పారు. చేతులు ఎలా శుభ్రపరుచుకోవాలో హాస్టల్ విద్యార్థులకు చూపించారు. వైద్యాధికారి దీవి కిషోర్‌కుమార్ మాట్లాడుతూ, ఆశా కార్యకర్తలు ప్రతిరోజు యాప్ వినియోగించాలన్నారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. డాక్టర్ వేముల ప్రియాంక, డాక్టర్ దేవరపల్లి సుభాష్ రమాదేవి, ప్రిన్సిపాల్ నిరీక్షణరావు, ప్రభాకరరెడ్డి, ఉమాకాంత్, బాలచంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాలను పారిశుధ్య సిబ్బందికి అందించాలి

● చైర్ పర్సన్ రాధిక

తెనాలి అర్బన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలు వ్యర్థాలను పారిశుధ్య సిబ్బందికి అందించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక కోరారు. 28వ వార్డులో జరుగుతున్న ప్రత్యేక పారిశుధ్య పనులను మంగళవారం ఆమె పరిశీలించారు. పారిశుధ్యాన్ని పర్యవేక్షిస్తున్న అధికారులకు సూచనలు చేశారు. కాల్వల్లో వ్యర్థాలను చూసి ప్రజలకు అవగాహన కల్పించారు. వ్యర్థాలు కాల్వల్లో వేయడం వలన మురుగునీటి ప్రవాహానికి ఆటంకం కలుగుతుందని, తద్వారా దోమలు వ్యాప్తి చెందుతాయని తెలిపారు. ప్రతిరోజు ఇంటి ముందుకు వచ్చే పారిశుధ్య సిబ్బందికి వ్యర్థాలను విడదీసి అప్పగించాలని సూచించారు. కౌన్సిలర్ యాతాటి అనిల్, హెల్త్ ఆఫీసర్ మొవ్వా యేసుబాబు తదితరులు పాల్గొన్నారు.

సుప్రీం కోర్టు ఘటన న్యాయ వ్యవస్థపై దాడి

● ఏపీ పౌర హక్కుల సంఘం కార్యవర్గ సభ్యుడు డాక్టర్ తూమాటి

పొన్నూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టులో ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడి న్యాయ వ్యవస్థపై జరిగిన దాడేనని ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం కార్యవర్గ సభ్యుడు డాక్టర్ తూమాటి రాజారావు అన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడికి ప్రజా సంఘాల నాయకులు మంగళవారం నిరసన తెలిపారు. స్థానిక పౌర హక్కుల వేదిక కార్యాలయంలో జరిగిన నిరసన కార్యక్రమంలో ప్రధాన న్యామూర్తిపై జరిగిన దాడి ఘటనను ప్రతి ఒక్కరూ ఖండించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు జీఎస్ రాయల్, తోడేటి శ్రీనివాస్, షేక్ సుభాని, శ్యాంసుందర్, సునీల్, బి.ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

పెదకాకానిలో నిరసన

పెదకాకాని, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై గవాయ్‌పై ఓ లాయర్ దాడికి పాల్పడటం అవమానకరమని పలు సంఘాల నాయకులు తీవ్రంగా ఖండించారు. మంగళవారం పెదకాకానిలోని మెయిన్ సెంటర్లో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో దళిత నాయకులు సర్పంచ్ గోళ్ళ స్వరూపరాణి, రాష్ట్ర గౌడ సంఘ నాయకులు కుక్కల రాంప్రసాద్ గౌడ్, కంతేటి ఎలమందరావు, సాల్మన్ రాజు, గోళ్ళ శ్యాం ముఖర్జీ, మదిరి శేషయ్య, సీపీఐ నాయకులు ఉప్పాల సత్యనారాయణ, సీపీఐ మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ, మైనార్టీ నాయకులు, అంబేద్కర్ అభిమానులు పాల్గొన్నారు.

ఎంపీపీఎస్ పాఠశాలలో మండల విద్యాశాఖ అధికారి తనిఖీ

చేబ్రోలు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): నారాకోడూరు మండలంలోని ఎంపీపీఎస్ పాఠశాలను మంగళవారం చేబ్రోలు మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ-2) ఆర్. సుబ్బారావు తనిఖీ చేశారు. పాఠశాలలోని రికార్డుల పరిశీలన, టీచర్స్ హ్యాండ్‌బుక్‌లను పరిశీలించి తగుసూచనలు చేశారు. దాతల సహకారంతో 20మంది విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కే.శంకర్, బాలస్వామి పాల్గొన్నారు.

ఫ్యాఫ్టో ధర్నాకు తరలిన ఏపీటీఎఫ్ నాయకులు

పొన్నూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఏపీటీఎఫ్ అధ్యక్షుడు ఎంఎం ఖుద్దూస్ డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ సమస్యలపై తలపెట్టిన ఫ్యాఫ్టో ధర్నాకు మంగళవారం పొన్నూరు ఏపీటీఎఫ్ నాయకులు తరలివెళ్లారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు ఎం.వెంకయ్య, స్టేట్ కౌన్సిలర్ ఎస్.విజయబాబు, జిల్లా కార్యదర్శి జి.శివరామకృష్ణ, కాకుమాను మండల అధ్యక్షుడు ఎం.సీతారామాంజనేయులు, రాజేష్, కే ఆదినారాయణ, అన్వర్ బేగ్, షేక్ బద్రుద్దీన్ పాల్గొన్నారు.

జీఎస్టీపై విద్యార్థులకు అవగాహనుండాలి: అసిస్టెంట్ కమిషనర్ రాధిక

పొన్నూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): వస్తు సేవల పన్నులపై విద్యార్థులకు అవగాహన ఉండాలని జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ ఎల్.రాధిక అన్నారు. పట్టణంలోని నేతాజీ నగర్ మున్సిపల్ హైస్కూల్లో మంగళవారం సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జీఎస్టీ అధికారులు గోపాలకృష్ణ, కిషోర్ ఎస్.ప్రసాదరావు, పురపాలక సంఘం మేనేజర్ పోతురాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కాకుమాను లాజర్‌బాబు, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

● చేబ్రోలు: నారాకోడూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్‌పై అవగాహన సదస్సు జరిగింది. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి రాయల సుబ్బారావు, హెచ్‌ఎం ఎం. ఏడుకొండలు, పాఠశాల ఉపాధ్యాయులు పి.రాజ్యలక్ష్మి, బి.కోటి పద్మ, పిచ్చమ్మ ఎం.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.